

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం

# వ్యవసాయం

డిసెంబర్, 2023

సంపుటి - 9 | సంచిక-12 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




మొక్కల ఆరోగ్య నిర్వహణ–ఆవిష్కరణ–సుస్థిరత అన్న అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మరియు ఉపకులపతి శ్రీ యం. రఘునందన్ రావు



డా॥ బి. రామమూర్తి నాల్గవ స్మారకోపన్యాసంలో ప్రసంగించిన నార్మ్ డైరెక్టర్ డా॥ సి. హెచ్. శ్రీనివాసరావును అభినందిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులు



కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాలో ప్రసంగిస్తున్న కేంద్రీయ ప్రత్తి పరిశోధన సంస్థ, నాగపూర్ డైరెక్టర్ డా॥ వై.జి. ప్రసాద్



ఏరువాక కేంద్రం, తాండూరు ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాలో ప్రసంగిస్తున్న విస్తరణ సంచాలకులు డా॥ వి. సుధారాణి



కృషి విజ్ఞాన కేంద్రం, వైరా ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాలో ప్రసంగిస్తున్న పరిశోధన సంచాలకులు, డా॥ పి. రఘు రామి రెడ్డి



వ్యవసాయ కళాశాల, జగిత్యాలలో నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న రైతులు మరియు శాస్త్రవేత్తలు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

డిసెంబర్, 2023
శ్రీ శోభకృత్ నామ సం॥ కార్తీక బహుళ చవితి నుండి మార్గశిర బహుళ చవితి వరకు

## సంపాదక వర్గం



**ప్రధాన సంపాదకులు**

డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

**సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు**

డా॥ ఎన్. రామగోపాల వర్మ
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

డా॥ ఎ. వి. రామాంజనేయులు
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & హెడ్

**పర్యవేక్షణ**

డా॥ ఆర్. సునీత దేవి
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే
Principal Agricultural Information Officer,
AI&CC and PJTSAU Press
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి

**చిరునామా :**
ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380
e-mail : pjtsau.paio@gmail.com
vyavasayam.pjtsau@gmail.com

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం.......................................... 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.............. 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ..................... 13
4. సాంకేతిక వ్యాసాలు
- యాసంగి మరియు వేసవి వరి సాగులో ఎంపిక చేసుకోవాల్సిన రకాలు మరియు వాటి లక్షణాలు.......... 14
- వరి సాగులో శ్రమ మరియు ఖర్చు తగ్గించే గట్లు చెక్కే యంత్రం............................................. 16
- వ్యవసాయ పదవినోదం...................................... 17
- హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి చేసే రైతాంగం పాటించవలసిన మెళకువలు................................................ 18
- వివిధ వాతావరణ పరిస్థితులలో వరిని ఆశించే చీడపీడలు-నివారణ మార్గాలు........................................ 21
- వరి మాగాణుల్లో జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగుకు లాభదాయక పంట- ప్రొద్దుతిరుగుడు..................... 23
- భారతదేశంలో నిషేధానికి గురైన మరియు కొన్ని పంటలలో వాడకానికి నిషేధించబడిన సస్యరక్షణ మందుల సమాచారం మరియు అవగాహన............... 26
- మొక్కజొన్నలో పూత అనంతర కాండంకుళ్ళు తెగుళ్ళు-సమగ్ర యాజమాన్యం........................................ 28
- వేరుశనగలో సస్యరక్షణ.................................. 30
- బి.టి ప్రత్తిలో గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు.................................. 34
- వ్యవసాయంలో పక్షుల యాజమాన్యం...................... 36
- డిసెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు............................................ 38
- మామిడిలో నెలవారీ చేయవలసిన యాజమాన్య పద్ధతులు................................................ 40
- గ్లాడియోలస్ కట్ ఫ్లవర్.................................. 42
- నోని ఔషధ ఉపయోగాలు.................................. 45
5. టి.వి.చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు............................................ 46
6. రైతన్నకో ప్రశ్న................................................. 47
7. విశ్వవిద్యాలయ వార్తలు........................................ 48
8. రైతు విజయగాథ
- రైతుల పాలిట వరంగా మారిన డ్రిప్ మరియు మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు.............................. 49

# డిసెంబర్ మాసం క్యాలెండర్ - 2023

## శ్రీ శోభకృత్ నామ సం॥ కార్తీక బహుళ చవితి నుండి మార్గశిర బహుళ చవితి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ. 3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ. 12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ. 1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ. 10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ. 9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| **31** చవితి ఉ. 10-11, మఖ పూర్తి, సా.వ. 6-02 ల 7-48 | | | | | **1** కార్తీక బ॥ చవితి పే. 3-07, పునర్వసు సా. 5-07, రా.వ. 1-46 ల 3-30 | **2** పంచమి సా. 4-34, పుష్యమి రా. 7-05, వర్జ్యము లేదు |
| **3** షష్ఠి సా. 6-23, ఆశ్రేష రా. 9-24, ఉ.వ. 9-07 ల 10-52 | **4** సప్తమి రా. 8-28, మఖ రా. 11-57, ఉ.వ. 10-40 ల 12-26 | **5** అష్టమి రా. 10-38, పుబ్బ రా. 2-34, ఉ.వ. 8-50 ల 10-36 | **6** నవమి రా. 12-43, ఉత్తర తె. 5-04, ఉ.వ. 10-31 ల 12-17 | **7** దశమి రా. 2-33, హస్త పూర్తి, ప.వ. 2-17 ల 4-03 | **8** ఏకాదశి తె. 4-01, హస్త ఉ. 7-24, సా.వ. 4-01 ల 5-44 | **9** ద్వాదశి తె. 5-01, చిత్ర ఉ. 9-16, ప.వ. 3-11 ల 4-53 |
| **10** త్రయోదశి తె. 5-32, స్వాతి ఉ. 10-41, సా.వ. 4-30 ల 6-10 | **11** చతుర్దశి తె. 5-31, విశాఖ ఉ. 11-38, ప.వ. 3-41 ల 5-19 | **12** అమావాస్య తె. 5-00, అనూరాధ ప. 12-02, సా.వ. 5-37 ల 7-13 | **13** మార్గశిర శుద్ధ పాడ్యమి తె. 4-02, జ్యేష్ఠ ప. 12-01, రా.వ. 7-50 ల 9-24 | **14** విదియ రా. 2-39, మూల ఉ. 11-33, ఉ.వ. 9-58 ల 11-33, రా.వ. 8-47 ల 10-20 | **15** తదియ రా. 12-56, పూర్వాషాఢ ఉ. 10-41, సా.వ. 6-17 ల 7-48 | **16** చవితి రా. 10-57, ఉత్తరాషాఢ ఉ. 9-31, ప.వ. 1-17 ల 2-47 |
| **17** పంచమి రా. 8-46, శ్రవణం ఉ. 8-08, ప.వ. 11-52 ల 1-22 | **18** షష్ఠి సా. 6-26, ధనిష్ఠ ఉ. 6-35, శతభిషం తె 4-48, ప.వ. 1-15 ల 2-43 | **19** సప్తమి సా. 4-00, పూర్వాభాద్ర తె. 3-12, ఉ.వ. 10-47 ల 12-16 | **20** అష్టమి ప. 1-56, ఉత్తరాభాద్ర రా. 1-40, ప.వ. 12-11 ల 1-41 | **21** నవమి ఉ. 11-36, రేవతి రా. 12-16 ప.వ. 12-58 ల 2-28 | **22** దశమి ఉ. 9-37, అశ్విని రా. 11-08, రా.వ. 7-19 ల 8-50 | **23** ఏకాదశి ఉ. 7-53, ద్వాదశి తె. 6-19, భరణి రా. 10-17, ఉ.వ. 8-23 ల 9-56 |
| **24** త్రయోదశి తె. 5-41, కృత్తిక రా. 9-50, ఉ.వ. 10-04 ల 11-38 | **25** చతుర్దశి తె. 5-12, రోహిణి రా. 9-48, ప.వ. 1-48 ల 3-24, తె.వ 3-30 ల 5-08 | **26** పూర్ణిమ తె. 5-14, మృగశిర రా. 10-16, వర్జ్యము లేదు | **27** మార్గశిర బ॥ పాడ్యమి తె. 5-45, ఆర్ద్ర రా. 11-12, ఉ.వ. 6-59 ల 8-39 | **28** విదియ పూర్తి, పునర్వసు రా. 12-39, ఉ.వ. 11-56 ల 1-37 | **29** విదియ ఉ. 6-45, పుష్యమి రా. 2-32, ఉ.వ. 9-16 ల 11-00 | **30** తదియ ఉ. 8-16, ఆశ్రేష తె. 4-48, సా.వ. 4-32 ల 6-17 |

25 క్రిస్టమస్ 26 బాక్సింగ్ డే 24 క్రిస్టమస్ ఈవ్

### జ్యేష్ఠ కార్తె (3.12.23 నుండి 15.12.23)

| | | |
|---|---|---|
| వరి | : | దీర్ఘకాలిక రకాల కోతలు, రబీ నారుమళ్ళకు ఎరువులు వేయుట, సస్యరక్షణ, ధాన్యాన్ని ఆరబెట్టుట |
| మొక్కజొన్న | : | అంతరకృషి, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట. |
| గోధుమ | : | అంతరకృషి, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట. |
| కాయధాన్యాలు | : | దీర్ఘకాలిక కంది రకాలు కోతకు వచ్చుట. |
| చెఱకు | : | నరుకుట, బెల్లం తయారీ. |
| ఆముదం | : | దీర్ఘకాలిక రకాల కాయ తీయుట ప్రారంభించుట. |

### మూల కార్తె (16.12.23 నుండి 28.12.23)

| | | |
|---|---|---|
| వరి | : | నారుమడికి ఎరువులు వేయుట, రబీ వరినాట్లకు పొలం తయారు చేయుట. |
| మొక్కజొన్న | : | అంతరకృషి, సస్యరక్షణ, ఎరువులు వేయుట. |
| గోధుమ | : | సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట. |
| రాగులు | : | రాగి విత్తుట. |
| కాయధాన్యాలు | : | పెసర, మినుములను వరి పండించిన భూముల్లో విత్తుట, కంది కోతలు, కంది మొదెం పంటగా సాగుచేయుట. |
| చెఱకు | : | తెలంగాణా జిల్లాల్లో నాట్లు. |
| వేరుశనగ | : | వరి పండించిన చేలలో విత్తుట. |

# పంట వ్యర్థాలను సమర్థంగా వాడి సంపద సృష్టిద్దాం....



యం. రఘునందన్ రావు
**ఉపకులపతి**

మనదేశంలోని విభిన్న వ్యవసాయ వాతావరణ మండలాల్లో అనేక రకాల పంటలను పండిస్తున్నారు. ఈ పంటల నుండి దాదాపు 620 మిలియన్ టన్నుల అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో 25–30% వరకు స్థానిక అవసరాలైన పశువుల మేత, పశువుల బెడ్డింగ్, వంట చెఱకు, సేంద్రియ ఎరువులకు, గృహ మరియు పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తుంటే, మిగిలిన పంట అవశేషాలను అత్యధిక శాతం రైతులు సద్వినియోగం చేయకుండా, వాటిని తగలబెట్టి తరువాత పంటకు నేలను సిద్ధం చేస్తున్నారు. దీని వల్ల భూమి పైపొరల్లో ఉండే సూక్ష్మపోషకాలకు నష్టం వాటిల్లి భూసారం తగ్గిపోతుంది. అంతేకాకుండా కార్బన్–డై–ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, సల్ఫర్–డై–ఆక్సైడ్, రేడియోధార్మిక పదార్థాల వంటివి ఎక్కువై కాలుష్యానికి దారితీస్తున్నది. పంట వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చడం ద్వారా స్వచ్ఛమైన, సురక్షితమైన మరియు స్థిరమైన వ్యవసాయానికి దోహదం చేయడమే కాకుండా గ్రీన్‌హౌస్ గ్యాస్ కాలుష్యం తగ్గించడంతో పాటు శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చును.

మన రాష్ట్రంలో వరి, మొక్కజొన్న, ప్రత్తి, కంది, సోయాచిక్కుడు వంటి పంటలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మన రైతాంగం వాతావరణంలో వచ్చే పెనుమార్పులను గమనిస్తూ, సహజ వనరులైన నేల, నీరు, గాలిని కాపాడుకుంటూ పంటల ఉత్పాదకతను, లాభాలను పెంచుకోవాలి. ఇందులో భాగంగా సమగ్ర వ్యవసాయం చేపట్టి పంటల అవశేషాలను కాల్చకుండా ఆధునిక పద్ధతులతో విలువలు జోడించి సద్వినియోగం చేసుకోవాలి. పంటల వ్యర్థాలను కంపోస్టు తయారీలో, మల్చింగ్‌గా ఉపయోగించడంతో పాటు వాటిని సమర్థవంతంగా భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బనం మరియు నత్రజని పెరుగుతుంది. తద్వారా పంటలకు పోషకాలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఈ వ్యర్థాలను సాంప్రదాయ అవసరాలకు ఉపయోగించిన తరువాత మిగిలిన వ్యర్థాలు వృధాగా పోకుండా వీటి నుండి ఉప ఉత్పత్తులను తయారు చేసి లాభాలు పొందవచ్చు. చైనాలో వరిగడ్డితో తయారుచేసే తిండి పదార్థాలు తినడానికి ఉపయోగించే పుల్లలు, చెంచాల పరిశ్రమలున్నాయి. మన రాష్ట్రంలో కూడ వరి ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవుతున్న నేపథ్యంలో దాని నుండి వచ్చే గడ్డితో వాణిజ్య ఉత్పత్తులైనటువంటి బోర్డులు, చాపలు, తాడులు, బుట్టలు, టోపీలు వంటి వాటిని తయారు చేసే పరిశ్రమలను నెలకొల్పుకోవచ్చును.

ఈ మధ్య కాలంలో బయోమాస్ గుళికలకు ఆధరణ బాగా పెరుగుతుంది. వీటిని ఎల్‌పిజి గ్యాస్, వంట చెఱకుకు ప్రత్యామ్నాయంగా వివిధ పరిశ్రమలలో ఇంధనంగా వాడుతున్నారు. వ్యవసాయం నుండి వచ్చే వ్యర్థాలైన వరి పొట్టు, ప్రత్తి మోడులు, కంది కట్టెలు, వేరుశనగ పొట్టు, మొక్కజొన్న కండెలను ఉపయోగించి బయోమాస్ గుళికలుగా మార్చే కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నట్లైతే యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంతో పాటు రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందుతారు. వ్యవసాయ మరియు అనుబంధ రంగాలపై పనిచేసే అంకుర సంస్థలు పంట వ్యర్థాలను సంపదగా మార్చే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాలు ఏరువాక కేంద్రాలు పంట వ్యర్థాల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నాయి. రైతాంగం, గ్రామీణ యువత అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకొని పంట వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, వృధాగా పోయే వాటిని సంపదగా సృష్టిస్తూ, సాగును లాభసాటిగా ఆచరిస్తారని ఆశిస్తూ...



(యం. రఘునందన్ రావు)
ఉపకులపతి



## వరి

- యాసంగి కాలంలో సాగుచేయడానికి స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలైన జగిత్యాల రైస్-1, కెఎన్‌యమ్-118, ఎమ్‌టియు 1010, తెల్లహంస లేదా అలాగే సన్న గింజ రకాలైన తెలంగాణ సోన, డబ్లుజిఎల్ 962, జగిత్యాల సాంబ, జగిత్యాల సన్నాలు, నెల్లూరి మషూరి వంటి రకాలను డిసెంబర్ 15 వరకు నార్లు పోసుకొనే అవకాశం ఉంది. ప్రస్తుతం పరిస్థితులలో స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రంలో ఆలస్యంగా నార్లు పోసుకొన్నప్పుడు ముఖ్యంగా వరి గింజకట్టేటప్పుడు ఉండే అధిక ఉష్ణోగ్రతల వల్ల సన్నగింజ రకాలలో పగుళ్ళు ఏర్పడి నూక శాతం అధికంగా ఉంటుంది. కావున ఏప్రిల్ మొదటి వారం వరకు వరి కోతలు పూర్తి అయ్యేలా చూసుకోవాలి.
- యాసంగి వరిలో విత్తనశుద్ధి కొరకు దమ్ము చేసిన నారుమడులకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి తరువాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.
- ముఖ్యంగా యాసంగి నారుమడి తయారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఒక ఎకరానికి సరిపడా నారుమడికి 2 క్వింటాళ్ళ బాగా మాగిన కోళ్ళు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోష్టు వేసి కలియదున్నాలి. నారు అడుగులో ఒక కిలో నత్రజని, 2 కిలోల భాస్వరం, ఒక కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి. నారు 15-20 రోజుల దశలో పై పాటుగా ఒక కిలో నత్రజని (2 కిలోల యూరియా) వేసుకోవాలి.
- డిసెంబర్ మాసంలో చలి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో నారుమడిలో మొక్కల ముదురు ఆకులు పసుపు రంగులోకి మారి నారు ఎదుగుదల లోపిస్తుంది. చలి యాజమాన్యంలో భాగంగా రాత్రి పూట నారుమడిలో నీరు నిండుగా ఉంచి ఉదయాన్నే చల్లటి నీటిని తీసివేసి క్రొత్త నీరు పెట్టాలి.
- యాసంగి వరి నారుమడిలో జింక్ లోప లక్షణాలు గమనించినట్లయితే జింక్‌సల్ఫేట్ 2 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- సాధారణంగా యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. కావున నాటడానికి వారం రోజుల ముందు ఒక కిలో యూరియాకు 2.5 గ్రా. కార్బండాజిమ్ 25% + మ్యాంకోజెబ్ 50% డబ్ల్యుఎస్ మిశ్రమ మందును కలిపి వేయాలి.
- ప్రధాన పొలాన్ని బాగా మురగనిచ్చి (10-12 రోజులు) దమ్ము చేసి చదును చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 16 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు అనగా 50 కిలోల డిఏపి, 15 కిలోల యూరియా, 14 కిలోల పొటాష్ వేసుకోవాలి.
- యాసంగిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఎక్కువ (డిసెంబర్-ఫిబ్రవరి). కావున నివారణకు ఐసోప్రోథయోలేన్ 320 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. ఒక ఎకరానికి పిచికారి చేయాలి.

డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9440225385

## మొక్కజొన్న

- డిసెంబర్ మాసంలో 30-40 రోజుల దశలో ఉన్న యాసంగి మొక్కజొన్న పైరుకు పైపాటుగా రెండవ దఫా నత్రజని ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలో వేయాలి. అంతరకృషి జరిపి మట్టిని మొక్కల మొదళ్ళకు ఎగదోయాలి.
- తొలిదశలో ఉన్న మొక్కజొన్నను గులాబి రంగు కాండం తొలుచు పురుగు మరియు కత్తెర పురుగు ఆశించే అవకాశం



ఉన్నది కావున మొలచిన 12-15 రోజుల దశలో వీటి నివారణకు లీటరు నీటికి 0.4 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారి చేయాలి.

- పూతదశకు ముందు నుండి గింజ పాలుపోసుకునే దశ వరకు మొక్కజొన్న బెట్టను తట్టుకోలేదు. ఈ దశలో నీటి తడులను తప్పని సరిగా ఇవ్వాలి. లేకపోతే దిగుబడి తగ్గుతుంది. 40-50 రోజుల దశలో రెండవ దఫాగా మరియు 50-60 రోజుల దశలో మూడవ దఫాగా నత్రజనిని వేయాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 25 కిలోలు, మూడవ దఫా నత్రజనితో పాటుగా వేయాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పంటపై భాస్వరం లోపం (ఆకులు ఊదా రంగులోకి మారడం) కనిపించవచ్చు. ఈ లోపాన్ని సవరించడానికి ఎకరానికి ఒక కిలో 19-19-19 (5 గ్రా. లీటరు నీటికి) లేదా డి.ఎ.పి. 1 % (10 గ్రా. లీటరు నీటికి) చొప్పున రెండుసార్లు వారం వ్యవధిలో పైరుపై పిచికారి చేయాలి.
- పూతదశలో పైరు బెట్టకు గురి అయినచో కాండం కుళ్ళు తెగులు ఆశించును కాబట్టి తప్పక నీటి తడులివ్వాలి. ఆకుమాడు/ ఆకు ఎండు తెగుళ్ళు సోకకుండా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. పొడతెగులు లక్షణాలు గమనించినచో ప్రొపికొనజోల్ 1 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చు.
- వానాకాలం వరి తర్వాత జీరోటిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్నను డిసెంబర్‌లోగా విత్తుకోవచ్చు. వరి మాగాణుల్లో భూమిని దున్నడం ఉండదు కనుక కలుపు ఎక్కువగా వస్తుంది. కాబట్టి కలుపు నివారణకు ఎకరాకు 1.0 కిలో అట్రజిన్ 50 % పొడిమందు మరియు వరిదుబ్బులు చిగురు వేయకుండా 1.0 లీటరు పారాక్వాట్‌ను 200 లీటర్ల నీటికి కలిపి విత్తిన 48 గంటల్లోపు నేల మరియు దుబ్బులు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి. మొక్కజొన్న మొలచిన తర్వాత పారాక్వాట్ కలుపు మందు పిచికారి చేయరాదు. మిగతా యాజమాన్య పద్ధతులైన ఎరువులు అందజేయుట మరియు సస్యరక్షణ సాధారణ యాసంగి మొక్కజొన్న పంటకు ఆచరించినట్లుగానే వరి మాగాణుల్లో సాగుచేసే మొక్కజొన్నకు కూడా పాటించాలి.

## చిరుధాన్యాలు

**రాగి:** రబీలో రాగి పంటను నవంబర్-డిసెంబర్ మాసంలో విత్తుకోవాలి. నాటే పద్ధతిలో 2 కిలోల విత్తనం లేదా వెదజల్లే పద్ధతిలో 3-4 కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తనశుద్ధికి గాను కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ మందును వాడాలి. ఐదు సెంట్ల నారు ఎకరాకు సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ. మొక్కల మధ్య 10 సెం.మీ. ఉండేటట్లు నాటుకోవాలి. కలుపు నివారణకు నాటే ముందు తడినేలపై పెండిమిథాలిన్ మందును 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నాటిన మూడు వారాల లోపు అంతరకృషి, కలుపు మరియు ఒత్తు మొక్కలను తీసివేయాలి. పూత దశలో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.

**కొర్ర:** నవంబర్‌లో వేసుకున్న కొర్ర పంటలో దంతె లేదా గుంటకతో అంతరసేద్యం చేయాలి. ఒత్తు మొక్కలను మూడు వారాలలోపు తీసివేయాలి.

**యాసంగి జొన్న:** యాసంగి జొన్నని మొవ్వు తొలిచే ఈగ ఆశిస్తే ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడి, మొక్క ఎదగకుండా ప్రక్కన పిలకలు వేస్తుంది. అలాగే మొవ్వుని పీకితే సులభంగా ఊడి వస్తుంది. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. కత్తెర పురుగు ఆశించినప్పుడు మొదటి దశ లార్వాలు పత్రహరితాన్ని గోకి తినుట వలన ఆకులపై తెల్లటిపొర ఏర్పడుతుంది. రెండు మరియు మూడవ దశ లార్వాలు ఆకు సుడిలో ఉండి రంధ్రాలు చేసుకొని తినటం వలన ఆకులపైన వరుస రంధ్రాలు ఏర్పడుతాయి. సుడిలోని ఆకులను పూర్తిగా



కత్తిరించి వేస్తుంది. పురుగు విసర్జించిన పసుపు పచ్చని గుళికలను సుడులలో గుర్తించవచ్చు. ఈ పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క సుడిలో పిచికారి చేసుకోవాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్ మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

- యాసంగిలో సాగుచేసిన వేరుశనగ ప్రస్తుతం 30 నుండి 60 రోజుల దశలో ఉంది. ఆలస్యంగా విత్తిన వేరుశనగ 20 రోజుల సమయంలో కలుపు నివారణకు ఇమాజితాఫిర్ 300 మి.లీ. లేదా ఇమాజితాఫిర్ 30% + ఇమాజామాక్స్ 35% కలుపు మందును 40 గ్రా. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- నవంబర్ మాసంలో వేసుకున్న పంటలో పైపాటుగా 10-15 కిలోల యూరియాను తొలిదశలో వేసుకోవాలి. 30 రోజుల దశలో మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు తెగుళ్ళు వచ్చే అవకాశం ఉంది. తెగుళ్ళు వచ్చినప్పుడు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి కాండం చుట్టూ నేల తడిచే విధంగా పిచికారి చేయాలి.
- 45 రోజుల దశలో ఉన్న పంటలో ఎకరానికి 200 కిలోల జిప్సం వేసి మొదళ్ళ దగ్గరకు మట్టిని ఎగద్రోయాలి.
- అక్టోబర్ మాసంలో విత్తుకున్న వేరుశనగ ప్రస్తుతం 60 రోజుల దశలో ఉంది. ఈ పంటకు పైపాటు ఎరువులు మరియు జిప్సం వేయడం అనేది పూర్తి అవడం వలన ఎలాంటి అంతరకృషి చేయకూడదు లేకపోతే ఊడలు దెబ్బతిని దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. యాసంగిలో వేసిన వేరుశనగ పంటలో నేల స్వభావాన్ని బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీటితడులు ఇవ్వవలెను.
- కాండం కుళ్ళు తెగులుని గమనించినట్లైతే మొదళ్ళు తడిచే విధంగా 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొవ్వ కుళ్ళు వైరస్ తెగులు నివారణకు 0.5 గ్రా. థయోమిథాక్సామ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఆకుముడత పురుగు నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- పొగాకు లద్దెపురుగు నివారణకు 0.2 మి.లీ. ఫ్లూబెండమైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎదిగిన లార్వాల ఉధృతి తీవ్రంగా ఉన్నప్పుడు (ఎకరానికి 5 కిలోల వరి తౌడులో 500 గ్రా. బెల్లం మరియు 500 మి.లీ. మోనోక్రోటోఫాస్) విషపు ఎర చేసుకొని చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం వేళ పొలంలో చల్లుకోవాలి.

## ఆముదం

- ప్రస్తుతం వానాకాలంలో విత్తుకున్న ఆముదం కోత దశలో ఉంది. ఒక గెలలో 80 శాతం కాయలు ఎండినట్లైతే అటువంటి గెలలను కోసుకోవాలి. కోసిన తరువాత గెలలను రెండు మూడు రోజులు నీడలో ఉంచి తరువాత ఎండబెట్టి పలకలతో కొట్టి విత్తనాన్ని వేరుచేసుకోవాలి.
- యాసంగి ఆముదం విత్తిన సమయాన్ని బట్టి ప్రస్తుతం 30, 45, 60 రోజుల దశల్లో ఉన్నది. దుక్కిలో వేయగా మిగిలిన నత్రజనిని పైపాటుగా వేసుకోవాలి.
- నేల స్వభావం బట్టి 12-15 రోజులకొకసారి నీటి యాజమాన్యం చేయాలి. మొక్కలు పుష్పించే దశలో, కాయ అభివృద్ధి చెందే దశలో నీటి తడులు ఇవ్వాలి. బిందు సేద్యపద్ధతిలో ఆముదంను పండించినప్పుడు 3 నుండి 4 రోజులకు 1.5-2.0 గంటలు నీరు ఇవ్వాలి.



- కలుపుని బట్టి అంతరకృషి చేసుకోవాలి. 60 రోజుల తరువాత అంతరకృషి చేయవలసిన అవసరం ఉండదు.
- ఎండు తెగులును గమనించినట్లైతే 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.
- రసం పీల్చు పురుగులైన పచ్చదీపపు పురుగులు, తామర పురుగులు, తెల్ల దోమ నివారణకు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- లద్దె పురుగు మరియు దాసరి పురుగు ఆశించినట్లైతే లీటరు నీటికి 1 మి.లీ. నొవాల్యురాన్ కలిపి పిచికారి చేసుకోవాలి.
- కాయ తొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## కుసుమ

- అక్టోబర్‌లో వేసిన పంటకు తడి కట్టేటప్పుడు ఎకరానికి 10-15 కిలోల యూరియాను వేసుకోవాలి.
- నవంబర్ మాసంలో విత్తుకున్న కుసుమ పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి పంటను పల్చన చేసుకోవాలి. కీలక దశల్లో (కాండం సాగే దశలో అనగా 30-35 రోజులు, పూత దశలో 65-75 రోజులు) తడి ఇచ్చుకున్నచో 40-60% దిగుబడి పెరుగును.
- ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.
- ఈ దశలో పేనుబంక తాకిడి ఎక్కువగా ఉంటుంది. పేనుబంక నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- ఆగష్టు మాసంలో విత్తిన పంట కోత దశలో ఉంటుంది.
- అక్టోబర్ మాసంలో వేసిన పంటకు రెండవ దఫా యూరియాని పైపాటుగా వేసుకోవాలి. ఆకర్షణ పత్రాలు వికసించే దశలో లీటరుకి 20 గ్రా. బొరాక్స్ కలిపి పిచికారి చేసుకోవాలి.
- నవంబర్‌లో వేసిన ప్రొద్దుతిరుగుడులో ఒత్తుగా ఉన్న మొక్కలను పల్చగా చేయవలెను. అంతర సేద్యం చేసి కలుపు నివారణ చేసుకోవాలి. విత్తిన 30-35 రోజులు మొదటి దఫా నత్రజని ఎరువులు వేసుకోవాలి.
- గంధకం తక్కువగా ఉన్న భూముల్లో ఎకరాకు 55 కిలోల జిప్సం వేస్తే నూనె శాతం పెరుగును.
- బెట్టకు గురి అయినప్పుడు పంటలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 4 మి.లీ. ద్రావణాన్ని 10 లీటర్ల నీటిలో కలిపి రెండు సార్లు, పిచికారి చేసుకోవాలి.
- బూడిద తెగులు ఆశిస్తే ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ యస్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838**

## సోయాచిక్కుడు

- పంట కోత మరియు నూర్పిడి అనంతరం, గింజలను 8-10% తేమ వచ్చే వరకు బాగా ఎండబెట్టి నిలువ చేయాలి.
- రైతులు తాము పండించిన పంటను వచ్చే సంవత్సరం విత్తనంగా వాడాలనుకుంటే నిలువ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి.
- నిలువ చేసే ముందు విత్తనాల నుండి చిన్న చిన్న కట్టెలను, పగిలిన గింజలను మరియు మట్టిని తీసివేసి శుభ్రపరుచుకోవాలి.



- విత్తన్నాని కొత్త గోనె సంచులలో నిలువ చేసుకోవాలి. అలాగే నిలువ చేసేటప్పుడు 5-6 సంచుల ఎత్తు వరకే వేయాలి.
- బాగా వెలుతురు మరియు చల్లగా ఉండే గదిలో మాత్రమే నిలువ చేయాలి. ఇరుకుగా ఉండే గదిలో నిలువ చేయరాదు.
- విత్తన సంచులను నేరుగా నేలపై కాకుండా చెక్క బల్లలపై నిలువ చేయాలి.
- నెల రోజుల వ్యవధిలో క్రమం తప్పకుండా విత్తన మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- అందుబాటులో ఉన్న శిలీంద్రనాశినితో, విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే, విత్తన మొలక శాతం తగ్గకుండా ఉంటుంది.

**డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304**

## అపరాలు

**కంది:** తొలకరిలో వేసిన కంది పూత. కాయ దశల్లో ఉంది. ఈ పంటకు మారుకా మచ్చల పురుగు మరియు కాయ ఈగ ఆశించే అవకాశం ఉంది. మరూకా మచ్చల పురుగు నివారణకు పైరు పూత దశకు రాకముందు నుండే జాగ్రత్త చర్యలు చేపట్టాలి. పూత ప్రారంభ దశలో తప్పనిసరిగా పైరుపై 5% వేపగింజల కషాయం లేదా వేపనూనె 5.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే రెక్కల పురుగులు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. మొగ్గ, పూత దశల్లో అక్కడక్కడ కొన్ని పూమొగ్గలను సేకరించి వాటిని తెరిచి పిల్ల పురుగులు కనిపించినట్లైతే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంటలో గూళ్ళు గమనించినట్లైతే నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యూరాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి మరల అవసరమైతే మందులను మార్చి మార్చి 2-3 సార్లు పూత మరియు కాయ దశల్లో పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాయ ఈగ నివారణకు పిందె దశలో డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నల్లి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**యాసంగి పెసర / మినుము:** పెసర / మినుము పిందె నుండి కాయ తయారయ్యే దశలో ఉన్నవి కావున నీటి ఎద్దడికి గురి కాకుండా చూడవలెను. అవసరాన్ని బట్టి తేలికపాటి తడి ఇచ్చినచో దిగుబడి పెరుగును. 20 గ్రా. యూరియా లేదా 10 గ్రా. మల్టీ-కె లీటరు నీటికి పిచికారి చేసినచో దిగుబడితోపాటు గింజ నాణ్యత కూడా పెరుగుతుంది. ఆలస్యంగా విత్తిన యాసంగి పెసర / మినుము పంటలు మొగ్గ పూత దశలో ఉన్నవి మొగ్గ దశలో తేలికపాటి తడి ఇచ్చినచో సమంగా పూతకు వచ్చి పిందె బాగా నిలుస్తుంది.

అధిక పగటి ఉష్ణోగ్రతల వలన రసం పీల్చే పురుగులు ముఖ్యంగా పేనుబంక ఆశించును నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పల్లాకు తెగులు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. తెల్లదోమ ఉధృతిని తగ్గించడానికి పసుపురంగు జిగురు అట్టలు అమర్చాలి. అవసరం మేరకు తెల్లదోమ నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైఫెన్థయూరాన్ 1.5 గ్రా. లీటరు నీటికి పిచికారి చేయాలి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు బూడిద తెగులు



ఆశించే అవకాశం ఉంది. నివారణకై నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా థయోఫానేట్ మిథైల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. రాత్రి చలి వాతావరణం దృష్ట్యా మినుము పైరులో కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు, బూడిద, త్రుప్పు మరియు సెర్కోస్పోరా తెగుళ్ళు ఆశిస్తాయి. వీటిని సమర్థవంతంగా అరికట్టడానికి పైరు 30-35 రోజుల దశలో 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 50-55 రోజుల దశలో 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వైరస్ తెగుళ్ళ నివారణకు సమగ్ర తెగుళ్ళ యాజమాన్యం పాటించాలి.

**శనగ:** శనగ వేసిన 30 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అంతరకృషి చేసి కలుపు నివారించాలి. తద్వారా తేమ కూడా ఎక్కువ రోజులు మొక్కకు అందుతుంది. యాసంగిలో విత్తిన శనగ పంటకు 35-40 రోజులకు మరియు 55-65 రోజులకు తేలికపాటి నీటి తడి ఇచ్చినచో దిగుబడులు పెరుగుతాయి. మొగ్గ దశలో ఉన్న శనగ పంటకు లీటరు నీటికి 20 గ్రా. డిఎపి లేదా యూరియా పిచికారి చేసినచో దిగుబడి పెరుగుతుంది. శనగను ఆలస్యంగా విత్తినచో తొలిదశలో పచ్చ రబ్బరు పురుగు ఆశించి నష్టపరుచును. నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

**వరి మాగాణుల్లో పెసర / మినుము రకాలు:**

**పెసర రకాలు:** ఎల్.జి.జి-460, ఎల్.జి.జి-410, టి.ఎమ్-96-2, ఐ.పి.ఎమ్-2-14, ఎమ్.జి.జి-351, ఎమ్.జి.జి-385

**మినుము రకాలు:** సకాలంలో విత్తితే (నవంబర్ రెండవ పక్షం నుండి డిసెంబర్ మొదటివారం వరకు) జి.బి.జి-1, టి.బి.జి-104, ఎల్.బి.జి-787, ఎల్.బి.జి-752, ఎల్.బి.జి-685, ఎల్.బి.జి-648, ఎల్.బి.జి-645, ఎల్.బి.జి-709 ఆలస్యమైతే (డిసెంబర్ రెండవ వారం నుండి ఆఖరి వరకు) ఎల్.బి.జి-22, ఎల్.బి.జి-685, ఎల్.బి.జి-709.

**విత్తన మోతాదు:** మినుము ఒక చదరపు మీటరుకు 30-35 మొక్కలు ఉండేట్లుగా ఎకరాకు 16-18 కిలోలు, పెసర ఎకరాకు 12 కిలోలు వెదజల్లితే మంచి దిగుబడులు సాధించవచ్చును.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- రాష్ట్రంలో ప్రత్తి రైతులు మొదటి తీత ప్రత్తి తీసుకోవడం జరిగింది. కొన్ని చోట్ల రెండవ తీత ప్రత్తి తీస్తున్నారు.
- డిసెంబర్ నెలలో ప్రత్తి పంటను తీసివేసి నీటి వసతి ఉన్నచోట రెండవ పంటగా నువ్వులు, పెసర, మినుము, బొబ్బర లేదా కూరగాయ లాంటి పంటలను సాగు చేయాలి.
- ప్రత్తి పంట సాగును జనవరి వరకు పొడిగించరాదు. పొడిగించినచో గులాబిరంగు పురుగు ఉధృతి ఎక్కువై గులాబిరంగు పురుగు సంతతి పెరిగి పంటను అధికంగా నష్టం చేసే అవకాశం ఉంది.
- ప్రత్తి చేను (ప్రత్తి కట్టెను) రోటవేటర్ లేదా ష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి, తద్వారా నేల సారవంతమవుతుంది మరియు నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.
- ప్రత్తి కట్టెను కాల్చరాదు.
- ప్రత్తి తీసేటప్పుడు గోనె లేదా గుడ్డ సంచులను వాడాలి, ఎండిన ఆకులు, కాయ తొడిమలు ప్రత్తిలో కలువకుండా చూసుకోవాలి.
- తీసిన ప్రత్తిని పట్టాలపై నీడలో 8 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లైతే మార్కెట్‌లో మంచి రేటు వస్తుంది.



- ప్రత్తి చేనులో గులాబిరంగు పురుగును గమనించినచో లీటరు నీటికి సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిపాస్ 2 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ + క్లోరాంత్రానిలిప్రోల్ 0.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి.
- ప్రత్తి కాయ లోపల / బయట కుళ్ళు గమనించినట్లైతే, బయట కాయకుళ్ళుకి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ + డైఫెన్‌కొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాయ లోపలి కుళ్ళు ఉంటే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల తేడాతో 2 సార్లు పిచికారి చేసుకోవాలి.
- చలి పెరిగితే ప్రత్తి ఆకులపై బూడిద తెగులు వస్తుంది. నివారణకై లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ మందును కలిపి పిచికారి చేయాలి.

**డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త, (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9908033309**

## చెఱకు

- డిసెంబర్ మాసంలో చెఱకును నాటుటకు నేలను అనువుగా తయారు చేసుకోవాలి. ముందుగా నేలను లోతు దుక్కి చేసుకోవాలి. దీని వల్ల వేరు మండలం బాగా విస్తరించి పంట ఎదుగుదలకు అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత పశువుల పెంట లేదా కంపోస్ట్ ఎరువులను ఎకరానికి 10 టన్నుల చొప్పున వేసి చెఱకును నాటుటకు 4 నుండి 6 వారాల ముందు పల్లెపు దంతితో భూమిలో కలియదున్నాలి.
- పూత పూయని చెఱకుల చిగురు భాగంగాని, 7-8 నెలల వయసు గల లేవడి తోటల చెఱకునుగాని మూడు కళ్ళ ముచ్చెలుగా కొట్టి విత్తనంగా వాడాలి. 90-150 సెం.మీ. ఎడంతో ఉండే చాళ్ళలో విత్తుటకు ఎకరాకు రెండు లేదా మూడు కళ్ళ ముచ్చెలను లేదా 48000 కణపులను కొట్టి విత్తనంగా వాడాలి. విత్తనపు ముచ్చెలను 200 లీటర్ల నీటికి 125 గ్రా. కార్బండాజిమ్ లేదా 200 మి.లీ. ప్రొపికొనజోల్ మరియు 600 మి.లీ. మలాథియాన్ కలిపిన ద్రావణంలో 15 నిమిషాలు ఉంచి నాటినట్లైతే పొలుసు పురుగు మరియు అనాసకుళ్ళు తెగులును అరికట్టుకోవచ్చు. అంతేకాకుండా శిలీంధ్రనాశినితో కూడా శుద్ధి చేయడం వలన కాటుక తెగులు నుండి రక్షణ పొందవచ్చు.
- చెఱకులో వేరు పురుగును గమనించినచో 40% ఇమిడాక్లోప్రిడ్ మరియు 40% ఫిప్రోనిల్ మిశ్రమ మందును 0.4 మి. లీ. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేయాలి.
- ముందుగా విత్తుకునే రైతులు స్వల్పకాలిక రకాలైన కో 6907, కో 8014, కో 94008, కో సి 671, కో 94012, 87 ఎ 298, 83 ఆర్ 23 మరియు మధ్యకాలిక రకాలైన కో 86032, కో 99004, కో 7805, 85 ఆర్ 186, 97 ఆర్ 129, కో 7219 వంటి రకాలను విత్తుకోవచ్చు.
- దూరపు చాళ్ళలో చెఱకును నాటుకునే వారు బిందు సేద్య పద్ధతి ద్వారా మరియు దగ్గరగా చెఱకును నాటుకునే రైతులు కాలువల ద్వారా పంటకు నీటిని పెట్టాలి.
- మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ల వరుసల మధ్య దుక్కి చేసి భూమి గుల్ల బారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి ప్రతి పిలకల నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణ వాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలకు నీరు, పోషకాలు సమతుల్యంగా తీసుకుంటాయి.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 22 వ తేదీన ప్రవేశించి జూన్ 24 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. రాష్ట్రంలో 01.06.2023 నుండి 30.09.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 738.6 మి. మీ. గాను 861.1 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం (17 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో 01.10.2023 నుండి 04.12.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లైతే సాధారణ వర్షపాతం 108.0 మి. మీ. గాను 24.6 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం (-77 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (29.11.2023) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాల్లో) వరి-0.06 శాతం (2374), జొన్న-11.63 శాతం (11866), మొక్కజొన్న-19.99 శాతం (102278), కంది-53.55 శాతం (1312), పెసర-1.94 శాతం (443), మినుములు-43.10 శాతం (18840) మరియు వేరుశనగ-51.54 శాతం (143008) సాగు చేయటం జరిగింది.

ఈ సంవత్సరం యాసంగిలో ఇప్పటి వరకు 8.84 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 18.11 శాతం, పప్పుదినుసులు 43.29 శాతం, నూనె గింజల పంటలు 40.15 శాతం సాగుచేయటం జరిగింది.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరిని సాగు చేయాలి.
- నీటి వసతి గల ప్రాంతాలలో యాసంగిలో జొన్న మరియు ప్రొద్దుతిరుగుడు పంటలను డిసెంబర్ 30 వరకు విత్తుకోవచ్చును.
- స్వల్ప కాలిక వరి రకాలను డిసెంబర్ 10వ తేది వరకు నారు పోసుకోవచ్చును.
- రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిళ్ళు కప్పి ఉదయం వేళల్లో తీసివేయాలి.
- ప్రతిరోజు నారుమడి నుండి ఉదయం నీటిని తీసివేసి మళ్ళీ బావి లేదా బోరు బావి నీళ్ళు పెట్టాలి.
- ఎకరా పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10-15 రోజుల్లో చల్లాలి.
- వరి నారుమళ్ళలో కార్బోఫ్యూరాన్ 3 సి. జి గుళికలను 200 చ.మీ. నారు మడికి (5 సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.
- యాసంగి మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు మొక్కజొన్న పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి.
- విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2-3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటిరోజు 100 గ్రా. థయోడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి.
- ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 9.5% + లామ్డాసైహలోత్రిన్ 12.6% 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మోకాలు ఎత్తుదశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం మరియు 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవలెను.
- మిరపలో తామర పురుగులు మరియు నల్లి ఉధృతి గమనించినట్లయితే నివారణకు, 1.5 గ్రా. డైఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ. క్లోరిఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పొడి వాతావరణం ఉన్నప్పుడు కూరగాయల పంటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.3 గ్రా. థయోమిథాక్సామ్ మందును లీటరు నీటికి కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9989625231






# యాసంగి మరియు వేసవి వరి సాగులో ఎంపిక చేసుకోవాల్సిన రకాలు మరియు వాటి లక్షణాలు

డా॥ పి. గోన్యానాయక్, డా॥ బి. శ్రీనివాస్, డా॥ పి. మధుకర్ మరియు డా॥ డి. శ్రీలత
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల

తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో అధిక మొత్తంలో సాగు చేసే ఆహార ధాన్య పంట వరి. రాష్ట్రంలో సుమారుగా 45-50 లక్షల ఎకరాలలో సాగు చేయబడుతూ యాసంగిలో అధిక దిగుబడిని రైతులు పొందడం జరుగుతుంది. రైతుల యొక్క మార్కెటింగ్ సౌలభ్యాన్ని బట్టి యాసంగిలో సాగు చేయడానికి అనుకూలంగా క్రింది రకాలు మరియు వాటి లక్షణాలు తెలపడం జరిగింది.

### 1. తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048)

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

దిగుబడ : 26-28 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు: : అగ్గితెగులును సమర్థవంతంగా తట్టుకొని అధిక దిగుబడినిచ్చే సన్నగింజ రకం.

### 2. జగిత్యాల సాంబ (జెజిఎల్-3844)

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

పంట కాలం : 120-125 రోజులు

దిగుబడి : 26-28 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : ఉల్లికోడును సమర్థంగా తట్టుకొని మరియు కంకినల్లిని తట్టుకొని అధిక దిగుబడినచ్చే సన్నగింజ రకం.

### 3. వరంగల్ వరి-2 (డబ్ల్యుజిఎల్ 962)

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

పంట కాలం : 125 రోజులు

దిగుబడి : 26-28 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : పొట్టిగా ఉండే సన్నగింజ రకము, కొంత వరకు అగ్గితెగులును, తట్టుకొని అధిక బియ్యం దిగుబడితో పాటు అన్నం నాణ్యత చాలా బాగుంటుంది.

### 4. కాటన్ దొర సన్నాలు (ఎమ్‌టియు 1010)

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

దిగుబడి : 28-30 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : సుడిదోమను కొంత వరకు తట్టుకునే దొడ్డు గింజ రకం. కోత ఆలస్యమైతే గింజ రాలే గుణం కలదు.

### 5. కూనారం సన్నాలు: (కెఎన్ఎమ్ 118)

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

దిగుబడి : 28-32 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : సుడిదోమను మరియు అగ్గితెగులును తట్టుకొని అధిక దిగుబడినిచ్చే దొడ్డు గింజ రకం.







**6. ప్రద్యుమ్న (జెజియల్-17004)**

అనువైన కాలం : అన్ని కాలాలకు

పంటకాలం : 105 రోజులు

వడ్ల దిగుబడి : 2.4-2.5 టన్నులు/ఎకరాకు

లక్షణాలు : ఉల్లికోడు (బయోటైప్ 1,2,5), అగ్గితెగులును తట్టుకొనును. స్వల్పకాలిక పొట్టిరకం, చేనుమీద పడిపోదు, బియ్యం మధ్యస్థరకం, నీటి సమస్య ఉన్న ప్రత్యేకపరిస్థితులకు అనువైన రకం, లేత నారు నాటినట్లైతే దిగుబడి అధికంగా ఉంటుంది

**7. బతుకమ్మ (జెజియల్-18047)**

అనువైన కాలం : అన్ని కాలాలకు

పంటకాలం : ఖరీఫ్ 120 రోజులు, రబీ 130 రోజులు

వడ్ల దిగుబడి : 2.8-3.2 టన్నులు/ఎకరాకు

లక్షణాలు : చలిని తట్టుకోవటంతో పాటు సుడిదోమను కొంత వరకు తట్టుకుంటుంది. అధిక దిగుబడినిచ్చు, ఎమ్‌టియు 1010 ని పోలిన దొడ్డుగింజరకం

**8. జగిత్యాల రైస్-1 (జెజియల్-24423)**

అనువైన కాలం : అన్ని కాలాలకు

పంటకాలం : వానాకాలం 125 రోజులు, యాసంగి 130 రోజులు

వడ్ల దిగుబడి : 3.0-3.5 టన్నులు/ఎకరాకు

లక్షణాలు : గింజ రాలదు, పంట పోదు, సుడిదోమను కొంతవరకు తట్టుకొనును. అధిక దిగుబడి నిచ్చు దొడ్డు గింజ నూతన వంగడం

**9. తెల్లహంస (ఆర్ఎన్ఆర్ 107554)**

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

పంట కాలం : 120 రోజులు

దిగుబడి : 22-26 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : చలిని బాగా తట్టుకుంటుంది. గింజ పొడవుగా అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. అగ్గి తెగులును తట్టుకోదు.

**10. రాజేంద్రనగర్ వరి-5 (ఆర్ఎన్ఆర్ 29325)**

అనువైన కాలం : యాసంగి మరియు వానాకాలం

పంట కాలం : 125 రోజులు

దిగుబడి : 30-32 క్వింటాలు/ఎకరాకు

లక్షణాలు : సుడిదోమను మధ్యస్థంగా తట్టుకుంటుంది. యాసంగిలో కూడా అధిక బియ్యం శాతం నిచ్చే దొడ్డు గింజ రకం మరియు చేను పడిపోదు. గోధుమ రంగు మచ్చ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9701592326**

# వరి సాగులో శ్రమ మరియు ఖర్చు తగ్గించే గట్లు చెక్కే యంత్రం



డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, కే. జ్ఞానేశ్వర్ నారాయణ, డా॥ ఎన్. లావణ్య, డా॥ ఓ. శైల, డా॥ బి. రాజశేఖర్, కె. రామకృష్ణ, డా॥ ఆదిశంకర్ మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సాగవుతున్న ప్రధాన పంట వరి. ఈ పంటను వానాకాలం మరియు యాసంగిలో కూడా చాలా ప్రాంతాలలో సాగు చేస్తున్నారు. ఈ పంట సాగులో రైతులందరూ ఎదుర్కొనే ప్రధాన సమస్య కూలీల కొరత. పంటకాలంలో అందరూ ఒకే సమయంలో నాట్లు వేసుకోవడం వలన పొలం తయారీ నుండి నాట్లు పూర్తయ్యే వరకూ కూడా కూలీల కొరత ఉంటుంది. అంతేకాక పెరుగుతున్న కూలీ ఖర్చుల వలన పెట్టుబడికి అయ్యే ఖర్చు ఏటా పెరుగుతోంది. వరి పంట పొలం తయారీలో అతి ముఖ్యమైనది గట్లు చెక్కడం. ఈ పని కష్టతరమైనది మరియు శ్రమతో కూడుకున్నది. ఈ పనికి మగ కూలీలు ఎక్కువగా అవసరమవుతారు. పంటకాల సమయంలో మగ కూలీలు దొరకడం చాలా కష్టం. ఈ సమస్యలను అధిగమించేందుకు ట్రాక్టర్ సహాయంతో నడిచే గట్లు చెక్కే యంత్రం ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది. కొంత మంది సృజనాత్మక రైతులు ఇప్పటికే ఈ యంత్రం ద్వారా గట్లు చెక్కి సత్ఫలితాలు సాధిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం ఆధ్వర్యంలో ఈ యంత్రాన్ని రైతులకు ప్రదర్శించడం జరిగింది.

**గట్లు చెక్కే యంత్రం:** ఈ యంత్రం ట్రాక్టర్ సహాయంతో నడుస్తుంది. ఈ యంత్రంలో నాలుగు ముఖ్యమైన భాగాలు ఉంటాయి. అవి

1) పవర్ ట్రాన్స్ మిషన్ సిస్టమ్ 2) రోటావేటర్ బ్లేడ్ యూనిట్ 3) రొటేటింగ్ డిస్క్ 4) రోలర్

పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ద్వారా యంత్రం పని చేయుటకు కావలసిన శక్తిని అశ్వశక్తి రూపంలో పంపబడుతుంది. రోటావేటార్ బ్లేడ్ యూనిట్ ద్వారా పొలం గట్టు చెక్కబడుతుంది మరియు గడ్డి మొక్కలు లాంటివి కత్తిరించబడతాయి.

రొటేటింగ్ డిస్క్ కదలికల వలన మట్టి గట్టుపై పడి పక్కల నుండి కొంత ఒత్తిడితో అదమబడుతుంది. రోలర్ గట్టు పైన పడిన మట్టిని గుండ్రంగా తిరుగుతూ అదిమి చదును చేస్తుంది. ఈ యంత్రాన్ని నడిపించడానికి కనీసం 45 హెచ్.పిల అశ్వ శక్తి కలిగిన ట్రాక్టర్ అవసరమౌతుంది.

**యంత్రం పనితీరు:**

- సాధారణంగా ఇద్దరు మనుషులు ఒక రోజు మొత్తం కష్టపడితే ఒక ఎకరా పొలంలో గట్టు చెక్కగలడు.
- ఈ యంత్రం సహాయంతో ఒక రోజులో 15-25 ఎకరాల వరకు గట్లు చెక్కవచ్చును. ఒక ఎకరా పొలంలో గట్లు వేయడానికి సుమారు రూ. 1000/- ఖర్చు అవుతుంది.
- ఒక గంటకు సునాయాసంగా 3-4 ఎకరాలలో గట్లు చెక్కవచ్చును. ఈ యంత్రాన్ని 90% డిగ్రీలో కుడి మరియు ఎడమ వైపుకు ఎటు అంటే అటు మలిపి ఉపయోగించవచ్చు.
- ఈ యంత్రం ద్వారా చేసిన గట్ల యొక్క ఎత్తు 425 మి.మీ. వరకూ మరియు వ్యాసం 310 మి.మీ. వరకు ఉంటుంది.
- ఈ యంత్రం గంటకు 1.8 కిలో మీటర్ల వేగంతో నడుస్తుంది.

**గట్లు చెక్కే యంత్రం ఉపయోగాలు:**

- ఈ యంత్రం సహాయంతో తక్కువ సమయంలో ఎక్కువ గట్లు చెక్కవచ్చు. దీని సహాయంతో దాదాపుగా 18 ఇంచుల వరకూ గట్లు చెక్కవచ్చు.
- ఈ యంత్రం యొక్క భాగాలు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడి ఉండడం వలన బురదలో నడిచినప్పటికీ తుప్పు పట్టకుండా ఉండి ఎక్కువ కాలం మన్నుతాయి.
- పొలం పని పూర్తయిన తర్వాత ఈ యంత్రాన్ని దగ్గరగా చేసుకుని ఒక పక్కన పెట్టవచ్చును.
- అత్యంత సమర్థవంతమైన పని తీరు కలిగి ఉండడం వలన రైతులకు ఎంతో ఉపయోగకరం.

కావున ఇన్ని ప్రయోజనాలు కలిగిన గట్లు చెక్కే యంత్రాన్ని ఉపయోగించి, సమర్థవంతమైన పని తీరుతో, కూలీల కొరతను అధిగమించి, శ్రమ తగ్గించి, తక్కువ సమయంలో పొలం గట్లు వేసుకుని, పంట సాగు ఖర్చు తగ్గించి మంచి ప్రయోజనాలను పొందవచ్చును.

ఈ యంత్రం యొక్క ఖరీదు రూ. 1,80,000/- నుండి రూ. 2,30,000/- వరకు ఉంటుంది. ఈ యంత్రం కావాలనుకున్న రైతు ఎస్.ఎన్.కె అగ్రి ఇంప్లిమెంట్స్ సెంటర్ లేదా మణికంఠ అగ్రో ఇండస్ట్రీ వారిని సంప్రదించగలరు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9848774820

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ కె. వాణిశ్రీ




**నిలువు**

1. వంకాయ ఆకులు, కాయల మీద నిచ్చెన లాంటి చారలను కలుగజేసే పురుగు ఏది? (7)
2. సాధారణంగా రెక్కల పురుగుల ఉధృతిని పర్యవేక్షించటానికి ఉపయోగించే బుట్టలను ఏమంటారు? (8)
3. ఐ.సి.ఏ.ఆర్ ఆధ్వర్యంలోని జాతీయ చెఱకు పరిశోధన సంస్థ ఎక్కడ ఉన్నది? (2)
4. గోరుచిక్కుడు నుండి తయారు చేసే జిగురు పదార్థం పేరు ఏమిటి? (3)
5. పొలంలో ప్రధాన పంటల చుట్టూగాని, గట్ల వెంబడి గాని కొద్ది వరుసల్లో వేసే పైర్లను ఏమంటారు? (5)
6. కత్తెర పురుగు మరియు పొగాకు లద్దె పురుగుల ఎదిగిన లార్వాలను నివారించుటకు ఏమి తయారు చేసి సాయంత్రం వేళల్లో వెదజల్లాలి? (5)

**అడ్డం**

1. ఏ మిత్ర పురుగు యొక్క తల్లి పురుగులు పూల పుప్పొడిని, పిల్ల పురుగులు రసం పీల్చుపురుగులను, కాయ తొలుచు పురుగులను మరియు గ్రుడ్లను తిని మేలు చేస్తాయి? (9)
2. ఇటీవల కాలంలో కుసుమ పంటను తొలిదశలో ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్న పురుగు ఏది? (6)
3. వివిధ పంటల్లో తెగుళ్ళ నివారణకు ఉపయోగించే విత్తనశుద్ధి శిలీంధ్రనాశిని ఏది? (3)
4. ప్రధాన పంటలకన్నా పురుగులు ఎక్కువగా ఆకర్షించే పంటలను ఏమంటారు? (5)
5. ఆశ, మారుతి, ఉజ్వల ఏ పంట యొక్క రకాలు? (2)

సమాధానాలు 29వ పేజీలో



# హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి చేసే రైతాంగం పాటించవలసిన మెళకువలు

డా॥ పి. మధుకర్, డా॥ బి. శ్రీనివాస్, డా॥ పి. గోన్యానాయక్, డా॥ డి. శ్రీలత, డా॥ జి, శ్రీనివాస్
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల

వరిలో ఎక్కువగా సూటి రకాలనే సాగు చేస్తున్న మనదేశంలో సంకర రకాల (హైబ్రిడ్స్) విస్తీర్ణం కేవలం 6 నుండి 8 శాతం మాత్రమే. అంటే 2022-23 సంవత్సరం గణాంకాల ప్రకారం మనదేశంలో వరి సాగు విస్తీర్ణం 43.5 మిలియన్ హెక్టార్లలో ఉంటే, అందులో హైబ్రిడ్ వరి విస్తీర్ణం 3.5 మిలియన్ హెక్టార్లు మాత్రమే. ప్రస్తుతం వాడుకలో ఉన్న మేలురకం వరి వంగడాలు ఎకరాకు దాదాపు 28-32 క్వి. దిగుబడిని ఇస్తున్నాయి. అయితే ఎంత మేలయినా యాజమాన్య పద్ధతులు పాటించినా వరి సూటి రకాలలో అత్యధిక దిగుబడిని (35-40 క్వి. ఎకరానికి) సాధించడం చాలా కష్టం. అయితే సంకర రకాల సాగులో దీన్ని సాధించవచ్చు. ఇప్పటి వరకు (2023) మనదేశంలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థల ద్వారా 137 వరి సంకర రకాలు (95 ప్రైవేట్, 42 ప్రభుత్వ) అభివృద్ధి చేయబడి సాగులో ఉన్నాయి. అయితే సూటి రకాలతో పోలిస్తే వరిలో సంకర విత్తనాన్ని ఉత్పత్తి చేయాలంటే పురుష వ్యంధత్వం గల “ూ” రకము మరియు ‘ూ’ (ఆడ) రకంలో ఫర్టిలిటీ లక్షణాన్ని పునరుత్పత్తి చేయగలిగే =(మగ) రకము అవసరము. భారతదేశంలో మొత్తం చూసినట్లైతే తెలంగాణ రాష్ట్రంలో 80 శాతం, కర్ణాటకలో 8 శాతం, మహారాష్ట్రలో 8 శాతం మరియు మిగతా రాష్ట్రాలలో 4 శాతం మాత్రమే వరి సంకర విత్తనోత్పత్తి జరుగుతుంది. అంటే వరి సంకర విత్తనోత్పత్తికి తెలంగాణ రాష్ట్రం వాతావరణం, నేలలు చాలా అనుకూలం. అందువల్ల ఈ విత్తనోత్పత్తి ద్వారా రైతులు అధిక నికర ఆదాయం పొందవచ్చు.

**విత్తన మోతాదు:** ఎకరానికి 6 కి॥ ఆడ రకము (A) మరియు 3 కి॥ మగ రకము (R) సరిపోతుంది.

**కలుపు యాజమాన్యం:** విత్తనోత్పత్తి క్షేత్రాలలోని ఏకవార్షిక గడ్డిజాతి కలుపు నివారణకి, నాటిన 3-5 రోజులలో 1 లీ. బ్యూటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్‌ని 20 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలి. నాటిన 15-20 రోజులకు గడ్డిజాతి కలుపు నివారణకు సైహలోఫాప్ పి బ్యూటైల్ 300 మి.లీ. ను ఎకరానికి, గడ్డి మరియు వెడల్పాటి ఆకు కలుపు నివారణకు బిస్ పైరి బాక్ సోడియం 100 మి.లీ. ఎకరాకు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 25-30 రోజులకి ఫినాక్సాప్రాప్ పి ఇథైల్ 350 మి.లీ. లేదా మెటామిఫాప్ 400 మి.లీ. మందు 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలి.

**కేళీల ఏరివేత మరియు అనుబంధ సంపర్కం:** కేళీల ఏరివేత పంట యొక్క మూడు దశలలో (పిలకదశ, పూతదశ, కోతకి ముందు) ఆడ మరియు మగ మొక్కల లక్షణాలని అనుసరించి బెరుకులని గుర్తించి ఏరివేయాలి. పూత సమయంలో ప్రతిరోజు ఆడ మరియు మగ వరుసల్లో కేళీలను తీసివేసిన తరువాతనే సంపర్కం చేయడం మంచిది. ఆడ వరుసలలో వచ్చే పోలెన్ షెడ్డర్స్ (దీ మొక్కలు) ని వాటి లక్షణాలని అనుసరించి అనగా క్రియాత్మక పుప్పొడిని కలిగి ఉండటం మరియు పొటాకు నుండి వెన్నులు పూర్తిగా బయటకు రావడం లాంటి లక్షణాలు కలిగి ఉన్నట్లైతే వెంటనే వాటిని తీసివేయాలి.

అనుబంధ సంపర్కం జరపటానికి ముందు ఆడ (A) వరుసలలోని మొక్కల పొటాకు పై నుండి 2/3 పొడవు కత్తిరించుకోవాలి. దీని వలన మగ (R) మొక్కల యొక్క పుప్పొడి ఏ అవరోధం లేకుండా ఆడ (ూా) మొక్కల కంకులపై పడుతుంది.

అనుబంధ సంపర్కమును ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రతి 30 నిమిషాలకు ఒకసారి సుమారు వారం పది రోజుల పాటు కర్రల సహాయంతో గాని తాడు సహాయంతో గాని మగ (R) మొక్కలని ఊపి పుప్పొడిని ఆడ (A) మొక్కలపై పడే విధంగా చేపట్టాలి. మంచి ఎండ మరియు గాలి ఉన్న సమయంలో అనుబంధ సంపర్కం సమర్ధవంతంగా జరుగుతుంది.

ఆడ మరియు మగ వరుసల పూత సమన్వయం కోసం మగ రకాన్ని మూడు దఫాలుగా విత్తుకొన్నప్పటికీ వాతావరణం మరియు యాజమాన్య పద్ధతుల్లోని తేడాల వలన కొన్నిసార్లు ఒకేసారి పూతకి రావడం జరగదు. దీని కోసం ఆడ, మగ రకాల పంట కాలపరిమితి అనుసరించి వెన్ను ఏర్పడే దశలలోని

వ్యత్యాసాన్ని 60 రోజుల ముందు నుండే గుర్తించాలి. ఒకవేళ తేడాని గమనించినట్లైతే ఆడ లేదా మగ రకాల మొక్కలు ఆలస్యంగా పూతకి రావడానికి 2 శాతం యూరియా ద్రావణాన్ని అలాగే త్వరగా పూతకి రావడానికి 1 శాతం ఫాస్ఫేట్ ఎరువుని పిచికారి చేయాలి. అదేవిధంగా పొలంలో నీరు నిండుగా ఉంచినట్లైతే మగ వరుసలు త్వరగా పూతకి వస్తాయి.

**ఆడ మరియు మగ మొక్క పూత సమయం వ్యత్యాసాన్ని తగ్గించడం:**

పూత వచ్చే సమయాన్ని ముందుగా అంచనా వేసే సూచిక పట్టిక

| స్థితి | వరి కంకి పొడవు (మి.మీ.) | పూతకి వచ్చే ముందు (రోజులలో) |
|---|---|---|
| I | 0.2 | 30 |
| II | 0.4 | 27 |
| III | 1.5 | 24 |
| IV | 2-8 | 18-20 |
| V | 10-25 | 13-17 |
| VI | 80-180 | 7-12 |
| VII | 190-220 | 5-6 |
| VIII | 260 | 4 |
| IX | 270 | 2 |
| X | పూర్తిగా పూతకు వస్తుంది | |

## ఒకే సమయంలో ఆడ-మగ మొక్కల పూత సమయాన్ని సర్దుబాటు చేసే పద్ధతులు:

### ఎ. పూత సమయాన్ని ఆలస్యం చేయడానికి చేసే పద్ధతులు

| క్ర.సం. | పద్ధతి/రసాయనం | రసాయనం మోతాదు | | ఏ స్థితిలో పాటించాలి | ఎన్నిరోజులు పూత సమయాన్ని ఆలస్యం చేయవచ్చు |
|---|---|---|---|---|---|
| | | మగ మొక్క అయితే | ఆడ మొక్క అయితే | | |
| 1. | యూరియా (పిచికారి) | 1-2 శాతం | 1-2 శాతం | III స్థితి ముందు | 2-3 రోజులు |
| 2. | పొలం నుండి నీటిని తొలగించడం | పని చేస్తుంది | పనిచేయదు | I-IV స్థితి | 2-3 రోజులు |
| 3. | పొటాకులను కత్తిరించడం | పనిచేస్తుంది | పనిచేస్తుంది | VII-VIII స్థితి | 2-3 రోజులు |

### బి. పూత సమయాన్ని ప్రేరేపించడానికి చేసే పద్ధతులు

| క్ర.సం. | పద్ధతి/రసాయనం | రసాయనం మోతాదు | | ఏ స్థితిలో పాటించాలి | ఎన్ని రోజుల్లో పూత సమయాన్ని ప్రేరేపించవచ్చు |
|---|---|---|---|---|---|
| | | మగ మొక్క అయితే (ఎకరాకు) | ఆడ మొక్క అయితే(ఎకరాకు) | | |
| 1. | సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ | 20-24 కిలోలు | 40 కిలోలు | స్థితి III ముందు | 4-5 రోజులు |
| 2. | జిబ్బరెల్లిక్ ఆమ్లం (జిఎ3) పిచికారి | 4-6 గ్రా. | 4-6 గ్రా. | పొట్ట దశలో | 2-3 రోజులు |
| 3. | బోరిక్ యాసిడ్ లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి | 40 గ్రా. | 60 గ్రా. | స్థితి III ముందు | 2-3 రోజులు |
| 4. | మోనోపొటాషియం పాస్ఫేట్ పిచికారి | 0.4 కిలోలు | 0.6 కిలోలు | స్థితి III ముందు | 2-3 రోజులు |









**జిబ్బరెల్లిక్ ఆమ్లం పిచికారి ప్రాముఖ్యత:** జన్యుపరంగా ఆడ రకం (A) మొక్కల వెన్నులు పొటాకు నుండి పూర్తిగా వెలువడవు. పొటాకు కత్తిరించడానికి అయ్యే కూలీల ఖర్చుని తగ్గించి వెన్నులు పూర్తిగా పొటాకు నుండి బయటకు రావటానికి జిబ్బరెల్లిక్ ఆమ్లం పిచికారి దోహదం చేస్తుంది. పిచికారిని రెండు దఫాలుగా, మొదట 10% వెన్నులు బయటకు వచ్చే దశలో 30-40 పిపిఎం గాఢతతో, రెండవసారి 30% వెన్నులు బయటకు వచ్చిన దశలో 60-80 పిపిఎం గాఢతతో పిచికారి చేసుకోవాలి. పౌడర్ రూపంలో ఉండే జిఎ3 ఆమ్లం నీటిలో కరగదు. కావున మొదట ఆల్కహాల్‌లో కొన్ని గంటలు కరిగించిన తరువాత మందు ద్రావణం తయారు చేసుకోవచ్చు.

ఈ విధంగా హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి చేసే రైతులు ఆడ మగ మొక్కలు పూత సమయంలో పైన తెలిపిన యాజమాన్య పద్ధతులను శాస్త్రీయ పద్ధతులను పాటించినట్లైతే సంకర వరి విత్తనోత్పత్తిలో మంచి దిగుబడులను పొందవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9908850198**

## మీకు తెలుసా?

**కమలాపండులో కంటే క్యాప్సికంలో 'సి' విటమిన్ అధికంగా ఉంటుంది**



# వివిధ వాతావరణ పరిస్థితులలో వరిని ఆశించే చీడపీడలు - నివారణ మార్గాలు

డా॥ ఎన్. లావణ్య, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, కె. జ్ఞానేశ్వర్ నారాయణ, డా॥ ఓ. శైల, కె. రామకృష్ణ, డా॥ బి. రాజశేఖర్, డా॥ ఆదిశంకర్ మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

మన రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న పంట వరి. ఈ పంటను వానాకాలం మరియు యసంగిలో కూడా చాలా మంది రైతులు సాగు చేస్తున్నారు. యాసంగిలో వరి సాగు చేసినపుడు నారుమడి దశ నుండి కోత వరకూ కూడా విభిన్న వాతావరణ పరిస్థితుల వలన పంట ప్రభావితమవుతుంది. వరిలో విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆశించే చీడ, పీడల ఉధృతిని సకాలంలో గుర్తించడానికి మరియు నివారణ చర్యలు చేపట్టడానికి రైతులు అవగాహన కలిగి ఉండడం అత్యావశ్యకం.

**వివిధ వాతావరణ పరిస్థితులలో వరిని ఆశించే చీడపీడలు:**

**కాండం తొలిచే పురుగు:**

**అనుకూల వాతావరణం:** రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి సూర్యరశ్మి రోజుకు 7 గంటలకు మించి ఉండడం, కరువు పరిస్థితులు నెలకొన్న సంవత్సరాలలో దీని ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఆలస్యంగా నాట్లు వేయడం, ముదురు నారు నాటడం మరియు నత్రజని లోపం అధికంగా ఉన్న నేలలలో కాండం బలహీనంగా ఉండడం ఉధృతికి దోహదం చేస్తాయి.

**నివారణ చర్యలు:** పిలకలు లేదా దుబ్బు చేసే దశలో ఎసిఫేట్ 75 ఎస్. పి. 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్. పి. 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అంకురం నుండి చిరుపొట్ట దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి. గుళికలు 8 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్. పి. 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 యస్. సి 0.3 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**సుడి దోమ:**

**అనుకూల వాతావరణం:** ఆగష్టు మాసంలో 300-400 మి. మీ. వర్షపాతం లేదా పొలంలో అధికంగా నీరు నిల్వ ఉండడం వలన రాత్రి ఉష్ణోగ్రతలు 21-23° సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు మరియు పగటి ఉష్ణోగ్రతలు 25-30° సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు, నత్రజని అధిక మోతాదులో వాడినప్పుడు మరియు కాలిబాటలు తీయని పొలాల్లో ఉధృతి అధికం అవుతుంది.

**నివారణ చర్యలు:** తొలి దశలో ఎసిఫేట్ 75 యస్. పి. 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే డైనటోఫ్యురాన్ 20 యస్. జి. 0.4 గ్రా. లేదా బ్యుప్రొఫెజిన్ 1.6 మి. లీ. లేదా పైమెట్రోజెన్ 50 డబ్ల్యు. జి. 0.6 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 % + ఎథిప్రోల్ 40 % డబ్ల్యు. జి. 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ఉల్లి కోడు:**

**అనుకూల వాతావరణం:** ఋతుపవనాలు ఆలస్యమై, ఆలస్యంగా నాటినప్పుడు (ఆగష్టు-సెప్టెంబర్ నెలల్లో), గాలిలో తేమ 82- 88% ఉన్నప్పుడు మరియు సెప్టెంబర్‌లో 200 మి. మీ. కన్నా అధిక వర్షపాతం నమోదైనప్పుడు ఉధృతి అధికం అవుతుంది.
















**నివారణ చర్యలు:** నారు మొలకెత్తిన 10-15 రోజుల లోపు 2 గుంటలకు (200 చ. మీ.) కార్బోఫ్యూరాన్ 3 సి.జి 800 గ్రా. నాటిన 10-15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3 సి.జి గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా ఫోరెట్ గుళికలు 15 కిలోలు వేయాలి.

**ఆకు ముడత:**

**అనుకూల వాతావరణం:** ఆలస్యంగా నాట్లు వేసిన (ఆగష్టు - సెప్టెంబర్ నెలల్లో) ప్రాంతాలలో అధిక వర్షాలు పడి తదుపరి బెట్ట పరిస్థితులు నెలకొనడం మరియు వారం పాటు మబ్బులతో కూడిన వాతావరణం. పొలం చుట్టూ నీడ ప్రదేశాలు ఉండడం మరియు నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడడం వలన ఉధృతి అధికం అవుతుంది.

**నివారణ:** కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లీటరు నీటకి కలిపి పిచికారీ చేయాలి.

**అగ్గి తెగ్గులు:**

**అనుకూల వాతావరణం:** నత్రజని అధిక మోతాదులో వాడినప్పుడు, గాలిలో తేమ అధికంగా ఉండడం (90%) మబ్బులతో కూడిన వాతావరణం సన్నని వర్షపు జల్లుతో కూడిన వాతావరణం మరియు ఉష్ణోగ్రత 18-20° సెంటిగ్రేడ్ మధ్య ఉన్నప్పుడు ఉధృతి అధికం అవుతుంది.

**నివారణ చర్యలు:** కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మి. లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కాండం కుళ్ళు తెగులు:**

**అనుకూల వాతావరణం:** సిద్ధ బీజాలు భూమిలో 6-9 నెలలు పాటు జీవిస్తూ పంట అవశేషాలు, సాగు నీరు, విత్తనం ద్వారా వ్యాప్తి చెందుతాయి. మురుగు నీరు వసతి లేకపోవడం, పురుగులు వలన ఏర్పడిన గాయాలు అధిక నత్రజని ఎరువులు వ్యాప్తిని ఉధృతం చేస్తాయి.

**నివారణ చర్యలు:** హెక్సాకొనజోల్ (5 ఇ. సి. లేదా 5 యస్. సి.) 2 మి. లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి. లీ. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ 1 మి. లీ. 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిలకలు కింది వరకు తడిచేల పిచికారీ చేయాలి.

**బ్యాక్టీరియా ఎండు తెగులు:**

**అనుకూల వాతావరణం:** ఎడతెరిపి లేకుండా (2-3 రోజులు) గాలులతో కూడిన వర్షాలు పడడం, తుఫాను దాటికి రోజుల తరబడి వర్షాలు కురవడం ఉష్ణోగ్రత 22-26° సెంటిగ్రేడ్ మరియు తెగులు ఆశించిన తర్వాత నత్రజని ఎరువులు వాడడం వలన ఉధృతి అధికం అవుతుంది.

**నివారణ చర్యలు:** తెగులు 5% కంటే ఎక్కువైతే నత్రజని ఎరువులు వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు ఆశించిన పొలంలోని నీటిని ఒకటి రెండు సార్లు పూర్తిగా బయటకు మురుగు నీటి కాలువల ద్వారా పంపించాలి. తెగులు వ్యాప్తిని అరికట్టుటకు అగ్రిమైసిన్ 0.4 గ్రా. లేదా ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ 0.2 గ్రా. 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**మాని పండు తెగులు:**

**అనుకూల వాతావరణం:** చిరుపొట్ట దశలో నుండి పుష్పించే సమయంలో చిరు గాలులతో కూడిన వర్షం లేదా అధిక తేమతో కూడిన వాతావరణం లేదా తుఫానుతో కూడిన వర్షం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం.

**నివారణ చర్యలు:** ప్రొపికొనజోల్ 1 మి. లీ. లేదా కార్బండాజిమ్ 50 శాతం డబ్ల్యు. పి. 1 గ్రా. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 75 డబ్ల్యు. జి. 0.4 గ్రా. మందును లీటరు నీటికి చొప్పున కలిపి వెన్నులు పైకి వచ్చు దశలో ఒకసారి వారం రోజుల తర్వాత ఒకసారి పిచికారీ చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.8985127856





# వరి మాగాణుల్లో జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగుకు లాభదాయక పంట - ప్రొద్దుతిరుగుడు

డా॥ డి. శ్వేత, డా॥ ఎస్. శ్రీదేవి, డా॥ సిహెచ్. పల్లవి, డా॥ ఇ. ఉమారాణి, ఎ. సరిత, జె. విజయ్, డా. ఎ. రమాదేవి, డా. టి. శ్రీ జయ మరియు డా. ఎస్. వాణి శ్రీ

వ్యవసాయ పరిశోధన స్థానం మరియు ఏరువాక కేంద్రం, తోర్నాల

తెలంగాణలో ప్రస్తుతం నీటి వసతి సౌకర్యం పెరగడం వల్ల రైతులు వానాకాలం మరియు యాసంగి రెండు కాలాల్లోను వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరుసగా వరి సాగు చేయడం వలన చౌడు నేలలు, మురుగు నీటి సమస్య, పురుగులు మరియు తెగుళ్ల ఉధృతి తదితర సమస్యలు తలెత్తుతాయి. ఈ పరిస్థితులలో పంట వైవిధ్యీకరణ చేపట్టడం అవసరం. వానాకాలం వరి సాగు అనంతరం యాసంగి ఆరుతడి పంటలు పండించిన యెడల నేలలో భూసారం పెరుగుతుంది, ఎరువుల వినియోగం, చీడపీడల ఉధృతి మరియు సాగు ఖర్చు తగ్గుతుంది. పంటల దిగుబడులు పెరిగి అధిక ఆదాయం పొందవచ్చు. పంట వైవిధ్యీకరణలో భాగంగా యాసంగిలో వరికి బదులుగా, వరి మాగాణుల్లో మరియు ఆరు తడి పంటగా ప్రొద్దుతిరుగుడు లాభదాయక ప్రత్యామ్నాయ పంట. తక్కువ కాల పరిమితి కలిగి త్వరగా పెరిగే గుణం ఉండి, ఏ కాలంలోనైన పండించుటకు అనువైన పంట ప్రొద్దుతిరుగుడు. వానాకాలంలో వరి పంటను కోసిన తర్వాత లేద జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడును నవంబర్ మరియు డిసెంబర్ నెలలో విత్తుకోవచ్చు. వరికోతలు ఆలస్యమైన ప్రాంతాలలో మరియు వేసవిలో జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.

జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు సాగులో క్రింద పేర్కొన్న యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చు.

**నేల తయారీ:** జీరో టిల్లేజ్ పద్ధతిలో వరికొయ్యకాలు ప్రధాన సమస్య. దీని నివారణకు పారాక్వాట్ అనే కలుపు మందును 5 మి.లీ. చొప్పున వరికొయ్యకాలు పైన పిచికారి చేయాలి.

**విత్తే సమయం:** వరికోతల తర్వాత జీరోటిల్లేజ్ పద్ధతిలో నవంబర్ మరియు డిసెంబర్ నెలలో విత్తుకోవచ్చు. వరికోతలు ఆలస్యమైన ప్రాంతాలలో మరియు వేసవిలో జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.

**రకాలు:** ప్రొద్దుతిరుగుడులో సూటి రకాల కంటే సంకర రకాలు ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. ప్రభుత్వ రంగ సంస్థల సంకర రకాలైన తిల్హన్ టెక్-ఎస్.యు.యెన్.హెచ్-1, ఎన్.డి.ఎస్.హెచ్ -1012, కె.బి. ఎస్.హెచ్-44, డి.ఆర్.ఎస్.హెచ్-1 మరియు ప్రైవేటు కంపెనీలకి చెందిన మంచి సంకర రకాలు అందుబాటులో కలవు.

**విత్తన మోతాదు మరియు విత్తన శుద్ధి:** సాధారణంగా ఒక ఎకరానికి 2.5 -3.0 కిలోల విత్తనం సరిపోతుంది. పంట మొదటి దశలో ఆశించే చీడపీడల నివారణకు విత్తనశుద్ధి తప్పనిసరిగా అవలంభించాలి. ప్రొద్దుతిరుగుడులో నెక్రోసిస్ వైరస్ తెగులు సమస్యను అధిగమించడానికి ఒక కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 3.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 5.0 మి.లీ. కలిపి శుద్ధి చేయాలి. అదేవిధంగా ఇప్రోడియాన్ 25% + కార్బండాజిమ్ 25% మందును 2 గ్రా. ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి ద్వారా ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులును నివారించుకోవచ్చు.










**విత్తే పద్ధతి మరియు దూరం:** సాధారణంగా జీరో టిల్లేజ్ పద్ధతిలో 45 సెం.మీ. × 20-25 సెం.మీ. దూరం ఉండేలా 5 సెం.మీ లోతులో చిన్న రంధ్రం చేసి విత్తనం విత్తుకోవడం వలన అధిక దిగుబడులను సాధించవచ్చు. విత్తిన 15 రోజులు కుదురుకు ఒక మొక్క ఉంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.

**కలుపు నివారణ:** ప్రొద్దుతిరుగుడు సాగు జీరో టిల్లేజ్ పద్ధతిలో కలుపు నివారణ ముఖ్యం. ప్రొద్దుతిరుగుడులో మొదటి 20 - 25 రోజులు కీలక దశ. వరికొయ్యకాలులో ప్రొద్దుతిరుగుడు విత్తిన రోజు ముందుగా పారక్వాట్ అనే కలుపు మందును 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. విత్తిన 24-48 గంటలలోపు తేమ గల నేలపై పెండిమిథలిన్ అనే కలుపు మందును 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. పంట 25-30 రోజుల దశలో క్విజాలోఫోప్ ఈథైల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఎరువుల యాజమాన్యం:** భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సిఫారసు చేయబడిన మోతాదులో పోషకాలు వాడాలి. ఎకరాకు 30 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఎరువులు వేయాలి. నత్రజని ఎరువులను సగం విత్తే ముందు, మిగతా సగం 2 దఫాలుగా 30 రోజులు మరియు 55 రోజులకు వేయాలి. బోరాన్ పూత దశలో చాలా కీలకమైన పాత్రను పోషించి పంట ఎదుగుదలలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. బోరాన్ లోపించిన యెడల మొక్కలు లేత మరియు మధ్య ఆకులలో చివర్లు గుండ్రంగా మారి వంకర్లు తిరుగుతాయి. పువ్వు చిన్నదిగా ఉండి పుప్పొడి ఉత్పత్తి తగ్గి గింజలు తక్కువగా ఏర్పడతాయి. కాబట్టి ఆకర్షక పత్రాలు వికసించు దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఒక ఎకరాకు 55 కిలోల జిప్సమ్ ని వేయడం వలన నూనె శాతం పెరుగుతుంది.

**నీటి యాజమాన్యం:** ప్రొద్దుతిరుగుడులో మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ మరియు గింజ కట్టే దశ కీలకం. ఈ పంట దశలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. నేల రకము మరియు వాతావరణ పరిస్థితులను బట్టి ఎర్ర నేలల్లో 8-10 రోజుల్లో, నల్ల రేగడి నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి.

**సస్య రక్షణ:** ప్రొద్దుతిరుగుడులో ముఖ్యంగా చీడపీడల్లో రసం పీల్చే పురుగులు (తెల్లదోమ మరియు తామర పురుగులు), పొగాకు లద్దె పురుగు, ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు, నెక్రోసిస్ తెగులు ఎక్కువగా ఆశిస్తాయి.

**తెల్లదోమ:** ఆకుల అడుగు భాగాన రసాన్ని పీల్చడం వలన మొక్కలు గిడసబారిపోతాయి. నివారణకు థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** ఈ పురుగులు ఆకులు మరియు పువ్వుల నుండి రసాన్ని పిలుస్తాయి. నెక్రోసిస్ వైరస్ తెగులును పరోక్షంగా వ్యాప్తి చేస్తాయి. నివారణకు థయోమిథాక్సామ్ 3 గ్రా.లేదా ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లేక ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దె పురుగు:** పైరు 30 రోజుల దశ నుంచి ఈ పురుగు ఆశిస్తుంది. గుంపులుగా చేరి ఆకులపై పత్రహరితాన్ని తినడం వలన ఆకులు జల్లెడ ఆకులుగా మారుతాయి. వీటి నివారణకు నొవాల్యురాన్ 1.0 మి. లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేక విషపు ఎర (5 కిలో తవుడు + అరకిలో బెల్లం + 0.5 లీ. మోనోక్రోటోపాస్ లేక క్లోరిపైరిఫాస్ కలిపి ఉండలుగా చేసి) సాయంత్రం వేళల్లో పొలంలో అక్కడక్కడా చల్లాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు:** ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు మాడిపోయినట్లు అవుతాయి. వీటి నివారణకు ప్రొపికొనజోల్ ( 25% ఇ.సి.) 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** తేమ ఎక్కువగా ఉండే వేడి వాతావరణంలో బూడిద తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఆకుల అడుగు భాగాన బూడిద లాంటి పొడి కప్పబడి ఉంటుంది. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ.లీటరు నీటికి కలిపి పిచికారి చేసి ఈ తెగులును అరికట్టుకోవచ్చు.

**నెక్రోసిస్ తెగులు:** ఈ తెగులు తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఆకులు సరిగా పెరగక గిడసబారిపోతాయి. పువ్వులు మెలిక తిరిగి వంకరగా మారుతాయి. దీని నివారణకు ప్రతి కిలో విత్తనానికి థయోమిథాక్సామ్ 3 గ్రా. లేక ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ. కలిపి విత్తనశుద్ధి చేయాలి. అలాగే పంటలో మరియు పొలం పరిసర ప్రాంతాలలో పార్థీనియం కలుపును నివారించాలి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి రెండు సార్లు పిచికారి చేయాలి.



పొగాకు లద్దె పురుగు




**పక్షుల బెడద:** ప్రొద్దుతిరుగుడు గింజ పాలుపోసుకునే దశ నుండి పక్షుల (ముఖ్యంగా రామచిలుకలు) వలన అధిక నష్టం వాటిల్లుతుంది. ఉత్తర - దక్షిణ దిశలో మెరుపు రిబ్బనులను పంటపైన అడుగు ఎత్తులో కట్టాలి. శబ్దం చేయడం ద్వారా లేదా దిష్టి బొమ్మలను ఉపయోగించి పక్షులను పాలద్రోలాలి. కోడిగ్రుడ్డు ద్రావణాన్ని 20 మి.లీ. కలిపి పూలపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. పిచికారి చేసే సమయంలో మూతికి మాస్క్ ధరించాలి.

**పంట కోత:** పువ్వు వెనక భాగం నిమ్మ పచ్చ రంగులోకి మారిన తర్వాత కోత యంత్రం చేత లేదా కూలీల సాయంతో పంటను కోయాలి. కోత అనంతరం పువ్వులను 2-3 రోజులు ఆరనిచ్చి కర్రలతో కొట్టి గాని, ట్రాక్టర్‌తో నడిపి నూర్పిడి చేసి గింజను వేరుచేసుకోవచ్చు. గింజల్లో తేమ 9-10 శాతం వచ్చేవరకు ఎండబెట్టాలి.

జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు సాగును పైన పేర్కొన్న మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, ఎకరాకు 8-9 క్వింటాళ్ళ దిగుబడిని రైతులు సాధించవచ్చు. ఒక ఎకరాకు జీరో టిల్లేజ్‌కు అయ్యే సాగు ఖర్చు సుమారు రూ. 17,000/- నుండి రూ.18,000/- వరకు వస్తుంది. ప్రస్తుతం అమలులో ఉన్న మద్దతు ధరతో ఈ పంట నుండి ఎకరాకు రూ. 35,000 - 40,000/- నికరాదాయం పొందవచ్చు.

యాసంగి వరితో పోలిస్తే జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు పంట వల్ల చాలా లాభాలు పొందవచ్చు. పంట కాలం నెల రోజులు తగ్గడంవల్ల పంట సాగుకు అయ్యే కూలీల ఖర్చు మరియు ఎరువుల ఖర్చు దాదాపు రూ.4,500 - 5,000/- తగ్గుతుంది. అలానే ఎరువుల వినియోగం తగ్గుతుంది, ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. తక్కువ నీటితో అధిక పంట దిగుబడి సాధించవచ్చు. వరి సాగుతో పోలిస్తే జీరో టిల్లేజ్ ప్రొద్దుతిరుగుడు సాగు ద్వార నీటి వనరులు తక్కువ ఉన్న ప్రాంతంలో కూడా అధనంగా రూ. 8,000 - 10,000/- వరకు ఆదాయం పొందవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం. 9493218700**

**గత మాసంలో పి.జె.టి.యస్.ఏ.యు వారి అగ్రికల్చర్ వీడియో - యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| | | |
|---|---|---|
| 1 | 13-11-2023 | కుసుమ సాగుతో ఎన్నో లాభాలు |
| 2. | 14-11-2023 | ఆలుగడ్డ సాగు - రైతులు అనుభవాలు |
| 3. | 17-11-2023 | యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు |
| 4. | 18-11-2023 | యాసంగికి అనువైన దొడ్డు పొడవు గింజ వరి రకాలు |
| 5. | 23-11-2023 | మిరపలో వైరస్ తెగుళ్ళు - సస్యరక్షణ |
| 6. | 25-11-2023 | లాభదాయకంగా యాసంగి మొక్కజొన్న సాగు |
| 7. | 25-11-2023 | మిరపలో వైరస్ తెగుళ్ళని నివారించండిలా.. (Shorts) |
| 8 | 25-11-2023 | లాభదాయకంగా యాసంగి మొక్కజొన్న సాగు (Shorts) |
| 9. | 29-11-2023 | యాసంగికి అనువైన సన్న గింజ వరి రకాలు |

**మరింత సమాచారం కోసం ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేసి సబ్‌స్క్రైబ్ చేసుకోగలరు**

https://www.youtube.com/channel/UCXPH9Z_h47zxJqrV7svmFKg








# భారతదేశంలో నిషేధానికి గురైన మరియు కొన్ని పంటలలో వాడకానికి నిషేధించబడిన సస్యరక్షణ మందుల సమాచారం మరియు అవగాహన

డా॥ ఆర్. సునీతా దేవి మరియు సి.హెచ్. వేణు గోపాల రెడ్డి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
రాజేంద్రనగర్, హైదరాబాద్





మన దేశ జనాభాకు ఆహార భద్రతను కల్పించాలంటే వివిధ పంటల ఉత్పత్తులను గణనీయంగా పెంచడమే కాకుండా ఆయా పంటలను ఆశించే చీడపీడల నుంచి రక్షించడం తప్పనిసరి. అనేక ప్రధాన ఆహార పంటలలో సుమారుగా 15-20% వరకు పంట నష్టం కేవలం చీడపీడల వలన కలుగుతుంది. రైతులు వివిధ పంటల్లో ఆశించే చీడపీడల నుండి పంటలను కాపాడుకోవడానికి ఎక్కువగా సస్యరక్షణ మందులపైనే ఆధారపడతారు. రసాయన మందుల వాడకం గమనించినట్లైతే సుమారుగా 60-65% కీటకనాశినుల వాడకంగా నమోదు చేయబడినది. అయితే, సస్యరక్షణ మందులను సిఫారసు చేసిన పంటలను సిఫారసు చేసిన మోతాదులో వాడినట్లైతే ఎటువంటి హాని ఉండదు. కాని వీటిని విచక్షణారహితంగా వాడినప్పుడు దుష్ఫలితాలకు దారి తీస్తుంది.

కావున భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాడకానికి నమోదించబడిన సస్యరక్షణ మందుల భద్రత మరియు సమర్ధతకు సంబంధించి నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి సమీక్షిస్తుంది. అటువంటి నిపుణుల కమిటీల సిఫార్సుల ఆధారంగా మానవాళి మరియు జీవరాశులకు హాని కలిగించే అత్యంత ప్రమాదకరమైన నాలుగు సస్యరక్షణ మందుల వాడకంపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడం జరిగింది. డైకోఫాల్, డైనోకాప్, మిథోమిల్ మరియు మోనోక్రోటోఫాస్ మందుల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ అక్టోబర్ 6, 2023 పురుగుమందుల (నిషేధం) ఆర్డర్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రచురించడం జరిగింది. ఈ ఆర్డర్ ప్రచురణ తేది నుండి పైన తెలిపిన మందుల నిషేధం అమలులోకి వస్తుందని తెలిపింది.

డైకోఫాల్, డైనోకాప్ మరియు మిథామిల్ సస్యరక్షణ మందుల ఉపయోగం భద్రత మరియు సమర్ధతపై డేటా అందుబాటులో లేకపోవడం వలన మానవులకు మరియు జంతువులకు ఆరోగ్య ప్రమాదాలు కలిగి ఉండటం వలన, అంతేకాకుండా వీటి కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నందున వీటిని తక్షణమే నిషేధించడం జరిగిందని తెలిపింది. అయితే మోనోక్రోటోఫాస్‌ను వెంటనే నిషేధించడం వలన రైతులు ప్రత్యామ్నాయం లేక నష్టపోతారనే ఉద్దేశంతో ఈ సస్యరక్షణ మందుకు ఒక సంవత్సరం పరివర్తన కాలాన్ని ఇవ్వడం జరిగింది.








కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ నెం. యస్.ఓ.4294(ఇ) ప్రకారం ఈ క్రింద తెలిపిన మందుల వాడకం నిషేదించడమైనది.

**నిషేధించబడిన సస్యరక్షణ మందులకు సంబంధించిన నిర్ణయ వివరాలు**

| సస్యరక్షణ మందులు | నిర్ణయ వివరాలు |
|---|---|
| డైకోఫాల్, డైనోకాప్ మరియు మిథోమిల్ | ఈ మూడు సస్యరక్షణ మందులకు సంబంధించి మంజూరు చేసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు, దిగుమతి, తయారీ, రవాణా, అమ్మకం మరియు వినియోగం పూర్తిగా నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది |
| మోనోక్రోటోఫాస్ | • మోనోక్రోటోఫాస్ 36% కరిగే ద్రవ (ఎస్ ఎల్) సూత్రీకరణ యొక్క వినియోగం మరియు తయారీకి సంబంధించి కొత్త రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీ చేయబోమని తెలిపింది. |
| | • మోనోక్రోటోఫాస్ 36% ఎస్ ఎల్ మందును ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను క్లియర్ చేసుకొనేందుకు నిల్వల గడువు కాలం ముగిసే వరకు మాత్రమే అమ్మకాలు పంపిణీ, వినియోగానికి అనుమతి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. |
| | • మోనోక్రోటోఫాస్ యొక్క ఇతర సూత్రీకరణాల కోసం లేబుల్ క్లెయిమ్‌లను ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చని తెలిపింది. |

**ఈ క్రింద తెలిపిన సస్యరక్షణ మందులను కొన్ని పంటలలో వాడకానికి నిషేధించబడ్డాయి**

| క్ర.సం. | సస్యరక్షణ మందు | వాడకూడని పంటలు |
|---|---|---|
| 1. | కార్బోఫ్యూరాన్ | కార్బోఫ్యూరాన్ మూడు శాతం ఎన్‌క్యాప్సులేటెడ్ గ్రాన్యుల్ (సిజి) మినహా కార్బోఫ్యూరాన్ యొక్క అన్ని ఇతర సూత్రీకరణలను ఉపయోగించడానికి నిషేధం విధించింది |
| 2. | మలాథియాన్ | జొన్నలు, శనగ, సోయాబీన్, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, బెండ, వంకాయ, క్యాలీఫ్లవర్, ముల్లంగి, యాపిల్, మామిడి, ద్రాక్ష మరియు టమాటలో వాడరాదు |
| 3. | క్వినాల్‌ఫాస్ | జూట్, యాలకులు మరియు జొన్నలో వాడరాదు |
| 4. | మ్యాంకోజెబ్ | జొన్న, జామ మరియు టోపియోలో వాడరాదు |
| 5. | ఆక్సీఫ్లోర్‌ఫెన్ | బంగాళాదుంప మరియు వేరుశనగలో వాడరాదు |
| 6. | డైమిథోయేట్ | ముడి ఆహార పదార్థాలుగా ఉపయోగించే పండ్లు మరియు కూరగాయలలో వాడరాదు |
| 7. | క్లోరోపైరిఫాస్ | రేగు, నిమ్మ, పొగాకు మరియు బత్తాయిలో వాడరాదు |

మనదేశంలో నిషేధానికి గురైన, వివిధ పంటలకు వాడకానికి అనుమతించబడిన లేదా పరిమితం చేయబడిన సస్యరక్షణ మందుల సమాచారాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలను, క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ లేదా సి.ఐ.బి & ఆర్ సి వారి వెబ్ సైట్ (www.cibrc.nic.in) నుండి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దానికనుగుణంగా సస్యరక్షణ మందులను వినియోగించుకోవాలి.





# మొక్కజొన్నలో పూత అనంతర కాండం కుళ్ళు తెగుళ్ళు - సమగ్ర యాజమాన్యం

**డా॥ బి. మల్లయ్య, డా॥ కె. వాణి శ్రీ, డా॥ డి. భద్రు మరియు డా॥ యం.వి. నగేష్ కుమార్**
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్

మనరాష్ట్రంలో యాసంగి మరియు వానాకాలంలో కలిపి మొక్కజొన్న సుమారుగా 12.0 లక్షల ఎకరాలలో సాగవుచున్నది. గత కొద్ది సంవత్సరాలుగా మారిన పరిస్థితులతో, బోర్లు మరియు ప్రాజెక్టుల క్రింద ఎక్కువ నీటి లభ్యత కారణంగా రైతులు మొక్కజొన్నను అధిక విస్తీర్ణంలో సాగు చేయుటకు మొగ్గుచూపుతున్నారు. రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేకపోవడానికి గల వివిధ కారణాలను విశ్లేషించినప్పుడు, వివిధ ఇతర సమస్యలతోపాటు చీడపీడలు ముఖ్యంగా, కత్తెర పురుగు మరియు పూత అనంతర కాండం కుళ్ళు తెగులుగా గుర్తించడమైనది. ఈ కాండంకుళ్ళు తెగులు భూమిలో విత్తనం ఉండే వివిధ శిలీంధ్రాల (మాక్రోఫోమినా, ఫ్యూజేరియం) ద్వారా వ్యాప్తి చెంది అధిక నష్టాలను (30-70%) కలుగజేయడం జరుగుతుంది. కేవలం పంటకాలంలో రసాయనిక మందుల పై ఆధారపడటం వల్ల ఈ తెగులును ఏ మాత్రం నియంత్రించలేదు. ఈ తెగుళ్ళు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించుట ఒక్కటే ఉత్తమ మార్గం.

**కాండం కుళ్ళు తెగుళ్ళ లక్షణాలు:** మొక్కజొన్న పైరు పూత దశలో ఈ తెగులు లక్షణాలు కనిపించును. ముఖ్యంగా వర్షాధారంగా వేసిన పంటలో పూత దశలో (60-70 రోజులు) వర్షాలు లేకుండా నీటి ఎద్దడికి గురి అయినప్పుడు లేదా యాసంగి పంటలో పూత దశలో నీటి తడుల మధ్య అంతరం ఎక్కువ అయినప్పుడు, వేడి వాతావరణం ఉన్నప్పుడు తెగులు ఉధృతమవుతుంది. తెగులు సోకిన కణుపు మధ్య భాగాలు కుళ్ళి నలుపుగా (మాక్రోఫోమినా), తెలుపు లేదా బెండుగా (ఫ్యూజేరియం) మారి మొక్కలు ఎండిపోతాయి.

పంటకోతకు రాకముందే కాండం భాగం విరిగి నేలపై పడిపోతుంది. కాండం చీల్చి గమనించినచో అనేక రకమైన నల్లని స్క్లీరోషియా బీజాలు కాండం లోపల, బెరడుపై మరియు కుళ్ళిన వేర్ల పైన గమనించవచ్చును. కణుపుపైన కాండం కుళ్ళును కలిగించే శిలీంధ్ర బీజాలు నేలలో మరియు మొక్కల అవశేషాలలో జీవించి ఉండి, నేలలో తేమ శాతం తగ్గినప్పుడు మరియు వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు మొక్కజొన్న పంటను తీవ్రంగా ఆశిస్తాయి.

**అనుకూల పరిస్థితులు:**

1. రోగనిరోధక శక్తి కలిగిన హైబ్రిడ్ మొక్కజొన్న రకాలను సాగు చేయకపోవటం
2. పంట మార్పిడి చేయకపోవటం





3. పూతదశలో నీటి ఎద్దడి మరియు అధిక ఉష్ణోగ్రతలు ఉండటం
4. పొటాషియం ఎరువును ఉపయోగించకపోవటం

**నివారణ:**

1. రోగ నిరోధక శక్తి కలిగిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన, డిహెచ్ఎమ్ - 117, కరీంనగర్ మక్క-1, డిహెచ్ఎమ్ - 206 మరియు గుర్తింపు పొందిన రోగనిరోధక శక్తి గల ప్రైవేట్ హైబ్రిడ్ మొక్కజొన్న రకాలను మాత్రమే తెగులు తరచూ ఆశించే పొలంలో సాగు చేయాలి.
2. పంట మార్పిడి చేయాలి లేదా పచ్చిరొట్ట పంటలను నేలలో కలియదున్నాలి.
3. మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ట్రైకోడెర్మా 10 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.
4. ట్రైకోడెర్మా శిలీంధ్రాన్ని పశువుల ఎరువులో/వానపాముల ఎరువులో వృద్ధి చేసి వరుసగా 3-4 సంవత్సరాలు భూమిలో కలపాలి.
5. ఎండకాలంలో లోతుగా దున్నుట మరియు సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. ముఖ్యంగా తెగులు అధికంగా ఆశించే భూమిలో పొటాష్ ఎరువును 150% వరకు పెంచి వేయాలి.
6. పూత దశలో పంట నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలి.
7. తెగులు ఆశించిన మొక్కలను తీసి కాల్చి వేయాలి.
8. చివరి అవకాశంగా మాత్రమే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు తెగులు ఆశించిన ప్రాంతంలోని మొక్కల మొదళ్ళను తడపాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9440504167**

## 17వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 లిం | | | 2 గు | జి | యా | వీ | వి | ల్ |
| | | గా | | | | | | | | |
| 1 అ | ల్లి | క | రె | క్క | 3 ల | పు | రు | 4 గు | | |
| క్షిం | | ర్ష | | | క్నో | | | ర్గ | | |
| త | | క | | 6 వి | | | | మ్ | ర | ఖై 3 |
| ల | | బు | | ష | | 5 కం | ది | | | |
| పు | | ట్ట | | పు | | చె | | | | |
| రు | | లు | | 4 ఎ | ర | పం | ట | లు | | |
| గు | | | | ర | | ట | | | | |
| | | | | | | లు | | | | |





# వేరుశనగలో సస్యరక్షణ

డా॥ యం. శంకర్, డా॥ వి. రామి రెడ్డి, కె. స్రవంతి, యన్. నవత, యం. మల్లా రెడ్డి మరియు డా॥ ఎస్. వాణి శ్రీ
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం

వేరుశనగను తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో సుమారుగా 1.43 లక్షల హెక్టారులలో సాగు చేస్తారు. పంట ఉత్పత్తి 2.4 లక్షల టన్నులు ఉండగా, ఉత్పాదకత సుమారుగా 2350 కిలోలు ఒక హెక్టారుకు వస్తుంది. దీనికి ప్రధాన కారణం పోషక లోపాలు మరియు చీడపీడల వల్ల దిగుబడులు తగ్గడం, ఎక్కువగా ఆశించి పంట ఉత్పాదకత తగ్గుతుంది. ఈ చీడపీడలను మరియు పోషక లోపాలను సరియైన సమయంలో గుర్తించి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే వేరుశనగ పంటలో అధిక దిగుబడి సాధించవచ్చు. ముఖ్యంగా రైతులు పంట తొలిదశలో ఆశించే పురుగుల నివారణకు విత్తనశుద్ధిని పాటించి, మొదలు కుళ్ళు తెగులు, వేరు పురుగులు ఆశించి మొక్కలు చనిపోవడం తగ్గించడం, తద్వారా మొక్కల సాంద్రతను పెంచినట్లయితే అధిక దిగుబడిని సాధించవచ్చు. అదే విధంగా వైరస్ తెగుళ్ల వ్యాప్తికి కారణమైన తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందే మొవ్వు కుళ్ళు మరియు కాండం కుళ్ళు తెగుళ్లను ముందుగా గుర్తించి వీటి నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే పంట నష్టాన్ని తగ్గించి అధిక దిగుబడిని సాధించవచ్చు.

వేరుశనగలో ఆకుముడత, పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, పేనుబంక, పచ్చదీపపు పురుగులు, తామర పురుగులు, వేరు పురుగు మరియు మారుకామచ్చల పురుగు ఆశించి ఎక్కువగా పంట నష్టాన్ని కలిగిస్తాయి.

**ఆకుముడుత పురుగు:** ఆకుముడుత పురుగు యొక్క సీతాకోక చిలుక గచ్చకాయ, గోధుమ రంగులకు మధ్యగా ఉంటుంది. ఈ పురుగు ఆకుల అడుగు భాగాన మధ్య ఈనెకు దగ్గరగా ఒక్కొక్కటిగా తెల్లని మెరిసే దాదాపు 200 గుడ్లను పెడుతుంది. ఈ పిల్ల పురుగు గుడ్డులో నుండి వెలుపలికి రాగానే ఆకు రెండు పొరల మధ్య చేరి అందులో ఉంటుంది. ఆకుల మీద చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఆకు రెండు పొరల మధ్యనున్న ఆకును తెరచి చూస్తే దానిలో లార్వా అగుపిస్తుంది. లార్వా పెరిగినకొద్ది బయటికి వచ్చి ప్రక్కనున్న కొన్ని ఆకులను కలిపి గూడులా కట్టుకొని దానిలో ఉండి పత్ర హరితాన్ని తింటుంది. ఈ పురుగు విత్తిన 15 రోజుల నుండి ఆశిస్తుంది. ఈ పురుగు ఎక్కువ ఆశించిన పంటను దూరం నుండి చూసినట్లయితే కాలిపోయినట్లు కనిపిస్తుంది.

**అనుకూల పరిస్థితులు:** యాసంగిలో వేడిగా మరియు పొడి వాతావరణం ఉన్నట్లయితే ఈ పురుగు ఎక్కువగా ఆశించటానికి దోహదపడుతుంది. విత్తిన 30 రోజుల తర్వాత బెట్ట పరిస్థితులు, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.3-5$^{0}$ సెంటిగ్రేడ్ ఎక్కువగా ఉండటం అనుకూలం.

**ఆర్థిక నష్ట పరిమితి స్థాయి:** పంట 30 రోజుల దశలో ఉన్నప్పుడు ఒక మొక్కకు 5 లార్వాలు ఉన్నచో లేదా 50 రోజుల పైరు దశలో



తామర పురుగులు ఆశించిన పంట



తామర పురుగులు



పచ్చ దీపపు పురుగు

ఒక మొక్కకు 10 లార్వాలు ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

**యాజమాన్యం:** ఈ పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. పురుగు ఉధృతిని ఎక్కువగా గమనించినప్పుడు ఒక లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి. లీ. లేదా డెల్టామెత్రిన్ 0.5 మీ. లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పొగాకు లద్దె పురుగు:** పొగాకు లద్దెపురుగు యొక్క రెక్కల పురుగులు లేత గోధుమరంగులో ఉండి రెక్కలపైన మచ్చలు కలిగి ఉంటాయి. ఇవి ఆకుల పైభాగంలో గ్రుడ్లను సమూహాలుగా పెట్టి వాటిపై రాగిరంగు కలిగిన నూగును కప్పుతాయి. వీటి నుండి చిన్నపురుగులు బయటికి వచ్చి ఆకులను గోకి తింటాయి. పొగాకు లద్దెపురుగు యొక్క చిన్న లార్వాలు లేత ఆకుపచ్చరంగులో ఉండి, పెరుగుతున్న కొద్దీ ముదురు ఆకుపచ్చరంగు, గోధుమరంగుకు మారుతాయి. శరీరం అంతా సన్నని లేత గీతలతో మెడమీద ప్రముఖంగా కనిపించే నల్లని మచ్చలు ఉంటాయి. చిన్న లద్దె పురుగులు ఆకులపై ఉన్న పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకులు జల్లెడాకుల్లా కనిపిస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పెద్ద లార్వాలు ఆకు మిగలకుండా తినివేసి మొక్కలను మోడులాగా (ఈనెలను మాత్రమే మిగిల్చి) మారుస్తాయి.

**అనుకూల పరిస్థితులు:** గాలిలో తేమ శాతం 85% కన్నా ఎక్కువగా ఉండి, పగటి, రాత్రి ఉష్ణోగ్రతలో $2-3^{0}$ సెంటిగ్రేడ్ తగ్గుదల ఉన్నప్పుడు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు $30-32^{0}$ సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రతలు $21-23^{0}$ సెంటిగ్రేడ్, 4 మి. మీ. కంటే ఎక్కువ వర్షపాతం పురుగు ఉధృతి పెరగడానికి కారణం. ఈ పురుగులు పగటివేళ మొక్కల అడుగున లేదా మట్టి పెళ్ళల క్రింద దాగి, రాత్రి పూట మొక్కలను ఆశిస్తాయి.

**యాజమాన్యం:** పంట విత్తేటప్పుడు పొలం చుట్టూ అక్కడక్కడ ఎరపంటగా ఆముదం మొక్కలు నాటాలి. ఆముదం ఆకుల క్రింద భాగంలో గుడ్ల సమూహాలు, మొదటి దశ మరియు రెండవ దశ లద్దె పురుగులను, జల్లెడాకులు ద్వారా గుర్తించి వాటిని నాశనం చేయాలి. పంట విత్తిన 10-15 రోజులలోపు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉనికిని, ఉధృతిని గమనించాలి. పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5% వేపగింజల కషాయం పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు నొవాల్యురాన్ 1 మి. లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.6 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లూబెండమైడ్ + హెక్సాకొనజోల్ 3 మి. లీ. లేదా క్లోరోఫెనాపైర్ 2 మి. లీ. లేదా నొవాల్యురాన్ + ఇండాక్సాకార్బ్ 1.75 మి. లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పెద్ద లార్వాలను విషపు ఎర ఉపయోగించి నివారించవచ్చు. ఇందుకు గాను 10 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, ఒక లీటర్ మోనోక్రోటోఫాస్ లేదా ఒక లీటర్ క్లోరిపైరిఫాస్ మందును కలిపి, తగిన నీటితో ఉండలుగా చేసిన ఎరను తయారు చేసుకొని సాయంత్రం వేళ సమానంగా ఒక ఎకరా పొలంలో చల్లి ఈ పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.

**శనగపచ్చ పురుగు:** శనగపచ్చ పురుగు యొక్క సీతాకోకచిలుక ముందు జత రెక్కలు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. లేత ఆకుల మీద, పూ మొగ్గలపైన తెల్లని గుడ్లను ఒక్కొక్క గుడ్డును విడివిడిగా పెడతాయి. పెరిగిన లార్వాలు ముదురు ఆకుపచ్చ నుండి గోధుమ రంగు, ఊదారంగు, నలుపు రంగులో కూడా ఉంటాయి. ఈ లార్వా శరీరం మీద సన్నని నూలు లాంటి రోమాలు పలుచగా దేహమంతా ఉంటాయి. ఈ పురుగులు లేత ఆకులపైన, మొగ్గలు మరియు పువ్వులపై చేరి రంధ్రాలను ఏర్పరుస్తాయి. ఇవి ఎక్కువగా లేత ఆకులను, మొగ్గలు మరియు పువ్వులను తింటాయి.

**అనుకూల పరిస్థితులు:** జూన్, జూలై మాసాలలో సాధారణం కన్నా అధిక వర్షాపాతం యాసంగి పంటలో మబ్బులతో కూడిన వాతావరణం, పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువ ఉన్నప్పుడు అనుకూలం.

**యాజమాన్యం:** వేసవిలో లోతు దుక్కులు చేయాలి. ఎకరానికి 4-5 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. లార్వాలు చిన్న దశలో ఉన్నప్పుడు ఒక కిలో బి.టి. ఫార్ములేషన్ లేదా 5% వేపగింజల కషాయంను


పచ్చ దీపపు పురుగు ఆశించిన పంట


ఆకుముడత పురుగు


ఆకుముడత పురుగు ఆశించిన పంట


పేనుబంక ఆశించిన పంట


పొగాకు లద్దెపురుగులు ఆశించిన పంట


వేరుపురుగు ఆశించిన పంట

పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలను నివారించుటకు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా స్పైనోశాడ్ 0.3 మి. లీ. లేదా నొవాల్యురాన్+ఇండాక్సాకార్బ్ 1.75 మి. లీ. లేదా మిథోక్సీఫెనొజైడ్ 1.75 మి. లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** పేనుబంక పిల్లపురుగులు ముదురు గోధుమ రంగులో ఉండి, పది రోజులలో మెరిసే నల్లని పెద్ద పురుగులు అవుతాయి. వీటి జీవితకాలం చాలా తక్కువ (5 నుండి 30 రోజులు). ఒక్కొక్క తల్లిపురుగు జీవితకాలంలో దాదాపు 100 పిల్లల్ని పెడుతుంది.

పిల్ల పురుగులు, పెద్ద పురుగులు విచ్చీ విచ్చని లేత మొవ్వులు, లేత ఆకుల మీద, ఊడల పైన, రెమ్మ మరియు కొమ్మల నుండి రసాన్ని పీలుస్తాయి. దీనివలన ఆకులు, రెమ్మలు వికారంగా ఆకారాన్ని కోల్పోయి మొక్కలు పెరగవు. ఆకుల మీద ఈ పేనుబంక విసర్జించిన పదార్థంపై నల్లటి శిలీంధ్రం పెరిగి కిరణజన్య సంయోగక్రియ తక్కువై పంటకు హాని కలిగిస్తుంది.

**అనుకూల పరిస్థితులు:** డిసెంబర్ మరియు జనవరి మాసాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 12-15° సెంటిగ్రేడ్ మధ్య ఉండి మబ్బులతో కూడిన వాతావరణం వ్యాప్తికి అనుకూలం.

**యాజమాన్యం:** ఈ పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి. లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పచ్చదీపపు పురుగు:** ఈ దీపపు పురుగులు రబీలో ఫిబ్రవరి, మార్చిలో వేరుశనగ సాగు చేసే ప్రాంతాలలో పైరును ఆశిస్తాయి. తక్కువ వర్షాపాతం, జల్లులతో కూడిన మరియు గాలిలో అధిక తేమతో కూడిన వేడిమి ఉన్న పరిస్థితులలో ఈ పురుగులు బాగా వృద్ధి చెందుతాయి. ఈ పురుగులు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. తల్లి పురుగులు గుడ్లను ఆకు మధ్య ఈనెలో గాని, ఆకు తొడిమెలో గాని చొప్పిస్తాయి. వారం రోజులలో పిల్ల పురుగులు గుడ్ల నుండి బయటికి వచ్చి 10 రోజులలో పెరిగి పెద్దవవుతాయి.

పెద్ద పురుగులు, పిల్ల పురుగులు కూడా ఆకుల అడుగు భాగాన ఉండి రసాన్ని పీలుస్తాయి. దీనివలన ఆకుల కొన భాగాన "V" ఆకారంలో పసుపు పచ్చ మచ్చలు ఏర్పడుతాయి. పచ్చ దీపపు పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఆకుల చివర్ల నుండి ఎండిపోతూ పంట కాలిపోయినట్లు కనిపిస్తుంది. దీనినే "హాపర్ బర్న్" అంటారు.

ఆర్థిక నష్ట పరిమితి స్థాయి పంట విత్తిన 30 రోజుల లోపల పైరు మొత్తం ఆకులలో 10 శాతం పచ్చదోమ పోటుకు గురైన ఆకులు ఉన్న యెడల లేదా మొక్కకు 5-10 శాతం పురుగులు ఉన్నప్పుడు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.

**యాజమాన్యం:** పసుపు రంగు జిగురు అట్టలు/ఎరలు ఉపయోగించి పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. + వేపనూనె 5 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి. లీ. లేదా లామ్డా సైహలోత్రిన్ 0.4 మి. లీ. లేదా థయోమిథాక్సామ్ + లామ్డా సైహలోత్రిన్ 0.5 మి. లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉన్నచో థయోమిథాక్సామ్ 0.5 గ్రా. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** తామర పురుగులు వేరుశనగను యాసంగిలో మరియు వానాకాలం ఆశిస్తాయి. ఈ పురుగులు గుడ్లను లేత వేరుశనగ మొక్క రెమ్మల లోనికి తోసి పెడతాయి. ఒక్కొక్క పురుగు 40-50 గుడ్లను పెడుతుంది.

పెద్ద పురుగులు, పిల్ల పురుగులు నోటితో ఆకులను గీకి రసాన్ని పీలుస్తాయి. మొదట్లో ఆకు పైభాగంలో తెల్లని మచ్చలు పడిన భాగాలు కనిపిస్తాయి. ఇవి ముఖ్యంగా లేత మొక్కలలో, లేత ఆకులలో బాగా కనిపిస్తాయి. మొక్కల పెరుగుదల తగ్గిపోతుంది. ముఖ్యంగా తామర పురుగులు మొవ్వు కుళ్ళు వైరస్‌ను వ్యాపింపజేస్తుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కలు గిడసబారి చిన్న ఆకులు కలిగి మెల్లగా చనిపోతాయి. కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించిన మొక్కలు 50-60 రోజులు దశలో చనిపోతాయి.

**యాజమాన్యం:** పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ 4-5 వరుసలు విత్తుకోవాలి. పొలంలో గాని, పొలం గట్లమీద కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ (పార్థీనియం) లేకుండా చూడాలి. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 2 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి వేరుశనగ పంటను రక్షించుకోవచ్చు. యాసంగి పంటలో విత్తిన 30 రోజులలోపుగా ముడుత కనిపించినట్లయితే

మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వేరు పురుగు:** వేరుపురుగు ఆశించిన వేరుశనగ మొక్కలు ఎండుతెగులు సోకినట్లుగా అగుపించడం, వరుసల్లో సముదాయాలుగా మొక్కలు చనిపోవడం గమనించవచ్చు.

**యాజమాన్యం:** క్లోరిపైరిఫాస్ 6 మి. లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్. 2 మి.లీ. ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసి నివారించు కోవచ్చు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న పొలాల్లో ఎకరాకు విత్తే ముందు థయోమిథోక్సామ్ + బైఫెన్‌త్రిన్ గుళికలు 5 కిలోలు వేసుకోవాలి. క్లోరిపైరిఫాస్ 2 మి. లీ. ఒక్క లీటరు నీటికి కలిపి పిచాకారి చేయాలి. ఫిప్రోనిల్ + ఇమిడాక్లోప్రిడ్ 0.625 గ్రా. లీటరు నీటికి కలిపి చల్లుకోవాలి.



**మారుకా మచ్చల పురుగు:** మారుకా మచ్చల పురుగు వేరుశనగలో ఎక్కువగా యాసంగి పంటను ఆశిస్తుంది. లార్వాదశ పురుగులు మొక్క యొక్క మొవ్వు భాగంలోకి చొచ్చుకొనిపోతాయి లేదా అక్కడ ఉన్న లేత ఆకులను గూడుగా చేసి తినడం ద్వారా నష్టపరుస్తాయి. తర్వాత దశలో కాండంలోనికి చొచ్చుకొనిపోయి కాండం తొలుచు పురుగు వలె వ్యవహరిస్తాయి.

**యాజమాన్యం:** ఈ పురుగు నివారణకు నోవాల్యూరాన్ 1 మి. లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వేరు శనగ పంటలో అడవి పందుల యాజమాన్యం:** అడవులకు సమీపంలో ఉన్న వ్యవసాయ సాగు పొలాల్లో అధికంగా అడవి పందులు సంచరించి నష్టాన్ని కలిగిస్తాయి. అడవి పందులకు వాసన పసిగట్టే గుణము అధికంగా ఉంటుంది కనుక దూరం నుంచే పంట పొలాలను గుర్తించి నష్టపరచడానికి అవకాశ ముంటుంది. అడవి పందుల దాడిని ఎదుర్కొనడానికి హైదరాబాద్‌లో అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం సూచించిన సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. సోలార్ ఫెన్సింగ్ పద్ధతి వలన అడవి పందులకు షాక్ తగిలి పంట పొలాల వైపు రాకుండా జంకుతాయి. ఈ పద్ధతికి ఎకరాకు సుమారు రూ. 86,400/- ఖర్చు అవుతుంది. పంట పొలం చుట్టూ ఒక అడుగు దూరంలో జి.ఐ. తీగ భూమికి ఒక అడుగు ఎత్తులో 3-4 వరసల్లో బిగించి కట్టినట్లయితే కంచె లాగా ఉండి, అడవి పందులు పంట పొలంలోకి వెళ్ళకుండా నిరోధిస్తాయి. ఒక ఎకరానికి రూ. 2500/- నుండి 3000/- ఖర్చు అవుతుంది.

పంట పొలం చుట్టూ ఒక అడుగు దూరంలో 2 అడుగుల వెడల్పు. ఒకటిన్నర అడుగుల లోతు కందకాలు ఏర్పాటు చేసినట్లయితే అడవి పందులు పొలం లోపలికి ప్రవేశించలేవు. వేరుశనగ పంట చుట్టూ 4-5 వరుసల కుసుమ పంట వేసినచో ఆ ముళ్ళు చర్మానికి గుచ్చుకొని అడవి పందులకు నొప్పిని కలిగిస్తాయి. పొలం చుట్టూ 4-5 వరుసల అముదం పంట దగ్గరగా వేసినచో పంట వాసన ఘాటుగా ఉండి లోపలికి పోవడానికి విముఖత చూపుతాయి. వాక్కాయ చెట్లను గట్ల వెంబడి పెంచడం వలన వాటి పదునైన ముళ్ళకు అడవి పందుల దేహం గాయపడి అడవి పందులు అరుస్తూ పారిపోతాయి. కుళ్ళిన కోడిగుడ్లు సేకరించి ద్రావణాన్ని తయారు చేసి 20 మి. లీ. లీటరు నీటికి కలిపి పంట పొలం చుట్టూ ఒక అడుగు వెడల్పుతో చదును చేసిన తడి భూమిపై పిచికారి చేసినపుడు పంట వాసన కంటే ఘాటుగా వుండి పందులు వెనుకకు వెళ్ళిపోతాయి. యంత్రాలు విద్యుత్/సోలార్ పలకల ద్వారా పని చేస్తాయి. ఈ యంత్రాల ద్వారా వెలువడే గాండ్రింపు శబ్దాలు 10-12 ఎకరాలకు వ్యాపిస్తాయి. ఈ యంత్రం ఖరీదు ఒక్కొక్కటి రూ. 25,000/-. క్షౌరశాలలో దొరికే వ్యర్థమైన వెంట్రుకలు సేకరించి గట్ల చుట్టూ ఒక అడుగు వెడల్పు ప్రాంతాన్ని చదును చేసి వెంట్రుకలను పలుచగా చల్లాలి. పంట పొలం చుట్టూ కర్రలను పాతి పాత చీరలను కట్టినట్లయితే అడవి పందులు రాత్రి సమయాలలో దాడి చేసినపుడు ఈ చీరల స్పర్శతో మనుషులు ఉన్నట్లుగా భ్రమపడి అరుస్తూ దూరంగా పారిపోతాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9490992296



# బి.టి ప్రత్తిలో గులాబిరంగు పురుగు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు

డా॥ కె. రాజశేఖర్, డా॥ మోహన్‌దాస్, సునీత శేషాద్రి మరియు వై. డా॥ ప్రవీణ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్

ప్రత్తిని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలసి సుమారు 17 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేయుచున్నారు. బిటి సాంకేతిక పరిజ్ఞానము రాకముందు ప్రత్తిని వివిధ రకాల కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరచడం జరిగింది. కాని 2002 సంవత్సరము నుండి బి.టి ప్రత్తిలో కాయతొలుచు పురుగుల ఉధృతి చాలా వరకు తగ్గింది. కాని 2015-16 సంవత్సరంలో ప్రత్తి పంట చివరి దశలో (నవంబర్-డిసెంబర్) గులాబిరంగు పురుగు ప్రత్తిని ఆశించి నష్టపరుస్తున్నట్లు గుర్తించడం జరిగింది.

ఈ గులాబి పురుగు పంటకాలంలో పూమొగ్గలను, పువ్వులను, కాయలను ఆశించి నష్టం కల్గిస్తుంది. కేవలం కాయతొలుచు పురుగుల నివారణకు వాడే సస్యరక్షణ మందుల ద్వారా దీన్ని నివారించడం కష్ట సాధ్యమవుతుంది. కావున ప్రత్తి రైతులు ఈ పురుగు ఉనికిని మరియు ఉధృతిని గమనించి సామూహిక సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే శనగపచ్చ పురుగు కంటే తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉంటుంది. కావున గులాబిరంగు పురుగు నివారణకు పురుగు వివిధ దశలను నష్టపరిచే లక్షణాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

**తల్లి రెక్కల పురుగు:** చిన్నదిగా ముదురు గోధుమ రంగులో ఉండి, ముందు రెక్కల పై భాగాన నల్లని మచ్చలను కలిగి ఉంటుంది. ఇది లేత ఆకుల క్రింద భాగాన, లేత కొమ్మల పైన, లేత కాయలపైన గ్రుడ్లను విడివిడిగా పెడుతుంది. ఒక్కో తల్లి పురుగు 150-200 వరకు గ్రుడ్లను పెడుతుంది. తల్లి పురుగు దశ అనేది 15-20 రోజుల వరకు ఉంటుంది.

**గ్రుడ్డు దశ:** గ్రుడ్డు అనేది బల్లపరుపుగా తెలుపు రంగులో ఒకటిగా/విడివిడిగా గాని లేదా సమూహంలో ఉంటుంది. ఈ గ్రుడ్డు పత్రహరితం, ఆకుల క్రింది భాగంలో లేదా మొగ్గల లేదా పువ్వుల క్రింది భాగంలో ఉండును. దీని కాల పరిమితి 3-6 రోజులు ఉండును.

**పిల్ల పురుగు (లార్వా):** గ్రుడ్డు నుండి పొదగబడిన పిల్ల పురుగు మొదటి రెండు దశలు తెలుపురంగులో ఉండి, మూడు నాలుగు దశలలో గులాబి రంగుకు మారతాయి. వీటి శరీరమంతా ముదురు, లేత రంగు చారలు ఉంటాయి. దీని కాలపరిమితి 9-14 రోజులు ఉండును.

**కోశస్థ దశ (ప్యూపా):** బాగా ఎదిగిన లార్వాలు కోశస్థదశకు చేరుకుంటాయి. ఇవి భూమిపై పొరలలో గాని, పగిలిన కాయలందున్న ప్రత్తిలో గాని, గింజలలోగాని కోశస్థ దశను పూర్తి చేసుకుంటాయి.

అనుకూల వాతావరణ పరిస్థితులు లేనప్పుడు మరియు ప్రత్తి పంటలేని సమయంలో ఈ పురుగు కోశస్థ దశలోనే సుమారు 10-12 నెలల వరకు కూడా నిద్రావస్థలో ఉండగలవు. పరిస్థితులు అనుకూలించినప్పుడు నిద్రావస్థ దశలో ఉన్న కోశస్థదశ నుండి రెక్కల పురుగులు బయటకు వస్తాయి.

**నష్టపరిచే విధానము:** చిన్న లార్వాలు పూమొగ్గలు, లేత కాయలను కంటికి కనిపించని సన్నని రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. లేత మొగ్గలను ఆశించిన చిన్న లార్వాలు ఎదిగే పూలలోని పదార్థాలను తినివేయుట వలన ఆకర్షణ పత్రాలు విచ్చుకోకుండా ముడుచుకొనే ఉంటాయి. వీటినే “గుడ్డి పూలు” అంటారు. ఇవి తొలిదశలోనే

రాలిపోతాయి. లార్వాలు లేత కాయలను ఆశించినప్పుడు అవి రాలిపోవడం గాని, కొన్నిసార్లు కాయలు ఎదగక, గుడ్డి కాయలుగా ఏర్పడి సరిగా పగలకపోవడం గాని జరుగుతుంది. లార్వాలు ముదురు కాయను ఆశిస్తే ఎంత మేరకు నష్టం జరిగింది అనేది కాయ పగిలిన తర్వాత మాత్రమే అంచనా వేయగలం. పురుగులు సాధారణంగా విత్తనం లోపలి భాగాన్ని తింటాయి. ఒక విత్తనం నుండి మరొక విత్తనాన్ని ఆశించేటప్పుడు మధ్యలో దూదిని కొరికి నాశనం చేస్తాయి. కావున దూది నాణ్యత తగ్గడం మరియు రంగు మారడం జరుగుతుంది. పురుగు ఆశించిన పంట దిగుబడి బాగా తగ్గడంతోపాటు, దూది నాణ్యత, ప్రత్తి బరువు బాగా తగ్గుతాయి.

**నివారణ పద్ధతులు:**

1. తక్కువ కాలపరిమితి గల రకాలను ఎంచుకొని సకాలంలో విత్తుకోవడం ద్వారా గులాబిరంగు పురుగు ఉధృతి చాలా వరకు తగ్గించుకోవచ్చు.
2. గులాబిరంగు పురుగు యొక్క చివరి లార్వా దశ విత్తనాలలో చాలా నెలలు గడిపి మరల విత్తిన పంటను ఆశిస్తుంది. కావున ఆమ్లంలో శుద్ధి చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి.
3. పొలం చుట్టూ బి.టి విత్తనాలతో సహా ఇచ్చిన నాన్ బి.టి విత్తనాలు విత్తుకోవాలి.
4. ప్రత్తి పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలు, మేకలు, పశువులను త్రోలి మేపాలి.
5. గుడ్డి పూలు, రాలిన మొగ్గలు, పూలు మరియు పిందెలను ఏరి నాశనం చేయడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.
6. ప్రత్తిని కార్శి పంటగా కాని లేదా వేసవి పంటగా కాని (డిసెంబర్) తర్వాత, సాగు చేయకూడదు.
7. పంట మార్పిడి పద్ధతిని తప్పని సరిగా పాటించాలి.
8. ప్రత్తి మోళ్ళను ట్రాక్టర్ రోటావేటర్ లేదా చిప్ ష్రెడర్ సహాయంతో భూమిలో కలియదున్నాలి.
9. లింగాకర్షక బుట్టల ద్వారా మరియు తరచు పంటను పరిశీలించడం ద్వారా పురుగు అభివృద్ధిని గమనిస్తూ ఉండాలి.
10. నీటి వసతి ఉన్నప్పటికీ ప్రత్తి పంటను 6 నుండి 7 నెలలోపు పూర్తి చేయాలి.
11. ప్రత్తి మోళ్ళను ఇండ్ల వద్ద వంట పొయ్యిలో వాడేందుకు, వంట చెఱకుగా నిల్వ చేయకూడదు.
12. ప్రత్తి ఏరివేత తరువాత ఎండిన మోళ్ళను, విచ్చుకోని కాయలను భూమిలో కలియదున్నాలి. దీని ద్వారా పురుగు కోశస్థదశలను నాశనం చేయవచ్చు.
13. ఎండాకాలంలో లోతు దుక్కులు చేసుకొనుట ద్వారా పురుగు యొక్క కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చు.
14. గులాబి రంగు పురుగు ఆశించిన ప్రత్తిని జిన్నింగ్ చేయడం ద్వారా వచ్చిన విత్తనాలను నిల్వ చేయకుండా త్వరగా నిర్మూలించాలి.
15. గులాబి రంగు పురుగు ఆశించిన ప్రత్తిని రైతు ఇంటి వద్ద గాని జిన్నింగ్ మిల్లుల వద్దగాని నిల్వ చేయకూడదు.
16. పురుగు అధికంగా ఉన్న ప్రాంతం నుండి విత్తన రవాణాను నియంత్రించాలి.
17. పురుగు ఉధృతి ఆర్థిక నష్టపరిమితి స్థాయికి వచ్చిన వెంటనే వేపనూనెను 1500 పిపియం ఉంటే 5 మి.లీ. లేదా 10000 పిపియం ఉంటే 9 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి ఈ క్రింది రసాయనిక మందులతో అప్పుడప్పుడు లేదా మధ్య మధ్యలో కలిపి పిచికారి చేయాలి.
18. పురుగు నివారణకు థయోడికార్బ్ 1.5 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ప్రత్తి పంట చివరి దశలో ఉన్నట్లైతే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్‌మిత్రిన్ 25% ఇసి 1.0 మి.లీ. లేదా లామ్డా సైహలోత్రిన్ 2.5 ఇసి 1 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ + లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
19. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులను ప్రత్తి పంట చివరి దశలో మాత్రమే పిచికారి చేసుకోవాలి. లేకపోతే తెల్లదోమ ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది.
20. రసాయన మందులను ఉదయం లేదా సాయంత్రం చల్లని వాతావరణంలో పిచికారి చేయాలి.

# వ్యవసాయంలో పక్షుల యాజమాన్యం

డా॥ యం. అనురాధ, డా॥ వి. రవీందర్ రెడ్డి, డా॥ వి. సునీత మరియు డా॥ ఐ. అరుణశ్రీ
సకశేరుక చీడల యాజమాన్యం, రాజేంద్రనగర్





తెలంగాణ రాష్ట్రంలో పండించే మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, సజ్జ మొదలగు పంటలలో చీడపీడలే కాకుండా పక్షుల వలన నష్టం జరుగుచున్నది. ముఖ్యంగా రామచిలుకలు, కాకులు, పావురాలు, గోరింకలు, బంగారు పిచ్చుకలు, నెమళ్ళు విత్తనాలు విత్తే సమయం నుండి మొలకెత్తే వరకు మరియు గింజపాలుపోసుకునే దశ నుండి గింజ గట్టిపడే వరకు నష్టం కలుగజేస్తాయి. సాధారణంగా తక్కువ విస్తీర్ణం గల పంటలలో మరియు ఎక్కువ పక్షిస్థావరాలున్నటువంటి ప్రాంతాలలో పక్షుల వలన నష్టం ఎక్కువ ఉంటుంది. సాధారణంగా పక్షులు ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు గింజలను ఏరుకుని తింటాయి. వివిధ పంటలలో పక్షుల వలన జరిగే నష్టం 10-50% వరకు ఉంటుంది. పక్షుల బెడద నుండి మన పంటలను కాపాడుకోవడానికి ఈ క్రింది పద్ధతులను అవలంభించవచ్చు.

**1. విత్తనశుద్ధి:** ఒక కిలో విత్తనానికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి విత్తినట్లైతే పక్షులకు ఆ గింజలు రుచించవు కాబట్టి తినకుండా వెళ్ళిపోతాయి. కోడిగ్రుడ్డు ద్రావణంలో విత్తనాలను నానబెట్టి విత్తినా పక్షులు తినవు. అందువలన విత్తనాలన్నీ మొలకెత్తుటకు అవకాశం ఉంటుంది.

**2. రిబ్బన్ పద్ధతి:** విత్తనం విత్తినప్పుడు భూమి నుండి ఒక అడుగు ఎత్తులో మరియు గింజ ఏర్పడే దశలో పంట నుండి ఒక అడుగు ఎత్తులో రెండు కర్రలను ఉత్తర-దక్షిణ దిశలలో నాటవలెను. వీటి సమయంతో పాలీప్రొపిలీన్ పదార్థంతో చేయబడిన 30 అడుగుల పొడవు, అర అంగుళం వెడల్పు కలిగి ఒక ప్రక్క ఎరుపు మరియొక ప్రక్క తెలుపు రంగు గల రిబ్బన్‌ను 3-4 మెలికలు త్రిప్పి కట్టవలెను. పక్షుల బెడద ఎక్కువగా ఉన్న ఎడల రిబ్బన్ల మధ్య దూరం 5 మీటర్లు లేకపోతే 10 మీటర్లు దూరంలో కట్టవలెను. సూర్యరశ్మి రిబ్బన్‌పై పడి దగదగా మెరుస్తూ, గాలి వీచినప్పుడు శబ్దం చేస్తూ పక్షులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. పంట దిశను పక్షులు చూడకుండా మెరుపులు పనిచేస్తాయి. ఒక రిబ్బను ఖరీదు రూ. 100/-.

**3. వేపగింజల కషాయం పిచికారి:** వేపగింజల పొడిని మూటకట్టి ఒక రాత్రంతా నీటిలో నానబెట్టి మరునాడు మూటను గట్టిగా పిండి పిప్పిని పడేసి కషాయాన్ని 25 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేసినచో పక్షులు గింజలను తినడానికి విముఖత చూపుతాయి.

**4. కోడిగ్రుడ్డు ద్రావణం పిచికారి:** కోడిగ్రుడ్ల ద్రావణం 25 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేసినచో వాటి వాసన, రుచి నచ్చక పక్షులు దూరంగా వెళ్ళిపోతాయి.

**5. స్ట్రీన్ క్రాప్ పద్ధతి:** మొక్కజొన్న, జొన్న, సజ్జ పంటలలో రామచిలుకలు ఎక్కువ నష్టం కలుగజేస్తాయి కావున పశుగ్రాస వంగడాలైన జొన్న గాని మొక్కజొన్న గాని దగ్గర దగ్గరగా 4-6 వరుసలు వేసుకున్నచో ప్రధాన పంటను నష్టం చేయవు.

**6. ఆర్తనాధ పద్ధతి:** పక్షుల ఆర్తనాదాలు, అరుపులను రికార్డ్ చేసి యంత్రాల ద్వారా పొలంలో వినిపించినట్లైతే పక్షులు బెదిరి పంట పొలాల నుండి దూరంగా పారిపోతాయి. సోలార్ (సూర్యరశ్మితో) పని చేయు యంత్రం ఖరీదు రూ. 20,000/- మరియు విద్యుత్ సరఫరాతో పనిచేయు యంత్రం రూ. 15,000/-.

**7. శబ్దప్రయోగ పద్ధతి:** పేలుడు శబ్దాలను ఉత్పత్తి చేసి పక్షులను భయభ్రాంతులకు గురిచేస్తారు. యంత్రంలో కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి శబ్దాన్ని ఉత్పత్తి చేస్తారు. ఈ మధ్య ఎల్.పి.జి గ్యాస్‌తో పేలుడు శబ్దాలను ఉత్పత్తి చేసే యంత్రాలు రూ. 40,000 ధర పలుకుతాయి. దీనితో 3-4 ఎకరాల పంటను కాపాడుకోవచ్చు.

**ప్రొద్దుతిరుగుడు పంటకు ప్రత్యేకంగా కాగితపు ప్లేట్ల పద్ధతి:** ఒకవైపు వెండిపూతను పోలిన మెరుపు గల కాగితపు ప్లేట్లను పువ్వుకాడకు అమర్చవలెను. సూర్యరశ్మితో వెండిపూత మెరిసి పక్షులు చూచుటకు తీవ్ర అసౌకర్యానికి గురవుతాయి. పక్షులు వాలడానికి ఈ పేపర్‌ప్లేట్‌లు ఆధారాన్నివ్వవు కాబట్టి గింజలను తినకుండాపోతాయి.

ప్రొద్దుతిరుగుడు పంటలో గుబ్బపునాడ ఆకారం (∩) లో వంగి ఉండే వంగడాలను సాగుచేసినచో పక్షులు కాడపై వాలి గింజలు తినుటకు కష్టపడతాయి.

**మొక్కజొన్న పంటలో ఆకుచుట్టు పద్ధతి:** గింజ పాలుపోసుకునే దశలో ఉన్న కంకిని చుట్టూ ఉన్న ఆకులతో చుట్టి పక్షులకు కనబడకుండా చేయాలి. గట్ల నుండి 3-4 వరుసల వరకు ఈ ఆకుచుట్టు పద్ధతితో పక్షుల దృష్టిని మరల్చి పంటను రక్షించవచ్చు.

మనదేశంలోని 1200 జాతుల పక్షులలో 346 జాతులు పురుగులను ఆహారంగా తీసుకుని పంటలను కాపాడి రైతులకు మేలు చేయుచున్నాయి. తెల్ల కొంగలు, మంగలిపిట్ట, గోరింక, పాలపిట్ట, చిన్న పసిరిక, మాలకాకి, కిరీటం పిట్ట మరియు పసరిక పిట్ట మొదలగునవి పొలం దున్ను సమయంలో భూమి నుండి బయటకు వచ్చిన పురుగులను ఏరుకొని తినడం ద్వారా వాటి ఉధృతి తగ్గి పంట రక్షించబడుతుంది. వేరుశనగలో ఒక కొంగ 20 నిమిషాలలో సుమారు 50 పురుగులను తింటుంది. ప్రత్తి, కంది పంటలను ఆశించే శనగపచ్చ పురుగు, పొగాకు లద్దె పురుగులను 40-60% వరకు పక్షులు తిని పంటలను కాపాడుతాయి. పొలం దున్ను సమయంలో 18 జాతుల పక్షులు వేరుపురుగును తిని వాటి సంతతిని 45-65% వరకు తగ్గిస్తాయి. వ్యాధి సోకిన పురుగులను తిని బ్యాక్టీరియా, వైరస్ వ్యాప్తికి దోహదం చేస్తాయి పక్షులు. 'T' ఆకారం కర్రలను ఎకరానికి 20 చొప్పున పంటపొలంలో నాటిన ఎడల పక్షులకు పురుగులను వేటాడుటలో ఎంతో ఉపయోగపడ్డాయి. మోదుగ, చీమచింత, మల్బరీ, నేరేడు చెట్లను గట్ల వెంబడి పెంచినచో 14 రకాల వివిధ జాతుల మిత్ర పక్షులకు స్థావరాలుగా ఉండి పురుగుల నిర్మూలన జరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9440488602







# డిసెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** ఈ నెలలో భూమిలో నిద్రావస్థలో ఉన్న పిండి పురుగులు బయటపడి చెట్లపైకి పాకి చెట్లను ఆశిస్తాయి. ఇవి ఆశించి కొమ్మలపై లీటరు నీటికి 0.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి పిచికారి చేయాలి. మామిడిని ఆశించే తేనెమంచు పురుగు, పొలుసు పురుగులు, బూడిద తెగులు నివారణకు 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 2.5 మి.లీ. వేపనూనెను లీటరు నీటికి చొప్పున కలిపి ఆకులు, కొమ్మలు, కాండం మొదలు తడిచేలా పిచికారి చేయాలి.

**జామ:** పిండినల్లి చిన్న, పెద్ద పురుగులు కొమ్మల చివర, కాయలను ఆశించి రసాన్ని పీలుస్తాయి. కాయలు, ఆకులు రాలిపోతాయి. ఇవి జిగురు పదార్థాన్ని విసర్జించడం వల్ల మసి తెగులు ఆశిస్తుంది. వీటి నివారణకు అక్షింతల పురుగు బదనికలను తోటల్లో విడుదల చేయాలి. ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్న తోటల్లో చెట్టుకు 250 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడిమందును పాదుల్లో చల్లి మట్టిలో కలిసేటట్లు చేయాలి.

**అరటి:** ఈ మాసం నుండి చలి పెరగడం వల్ల జింక్ ధాతు లోపం కనిపిస్తుంది. ఆకుల ఈనెల వెంబడి తెల్లని చారలు ప్రారంభమై ఆకులు పాలిపోయినట్లు కనబడతాయి. ఆకుల అడుగు భాగాన ముదురు ఊదా రంగు ఏర్పడుతుంది. దీని నివారణకు ఒక్కొక్క మొక్కకు 10 గ్రా. జింక్ సల్ఫేట్ భూమిలో వేయాలి. ఆకులపై 2 గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** అంబేబహార్ (జనవరి పూలు) చెట్లు పూతకు రావడానికి నీటిని ఇవ్వడం ఆపి బెట్టకు సరి చేయాలి. నల్లి పురుగుల నివారణకు 3 గ్రా. గంధకంను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. 15 రోజుల తరువాత రెండో దఫా పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** బూడిద తెగులు నివారణకు కొమ్మలు కత్తిరించిన 15వ రోజు హెక్సాకొనజోల్ 1 మి.లీ. 70 రోజులప్పుడు ఇప్రొవాలికార్బ్ + ప్రొపినెబ్ 3 గ్రా., 75వ రోజు మైక్లోబ్యుటానిల్ 0.4 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**సపోటా:** ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఆపిల్, రేగు:** ఈ మాసంలో బూడిద తెగులు ఆశిస్తుంది. లేత ఆకులపైన, కాయలపైన తెల్లటి మచ్చలు ఏర్పడి తర్వాత అంతా వ్యాపిస్తుంది. నివారణకు 3 గ్రా. గంధకంను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.





**కూరగాయలు:**

**టమాట:** ఆకు ఎండు తెగులు వల్ల గోధుమ రంగు మచ్చలు మొక్కలోని అన్ని భాగాలకు వ్యాపించి నష్టపరుస్తాయి. పూత, పిందెను కూడా ఈ తెగులు ఆశిస్తుంది. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు టెబ్యుకొనజోల్ 1.5 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి.

**మిరప:** రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గే కొద్దీ కొమ్మ కుళ్ళు, కాయ ఎండు తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ లేదా పైరాక్లోస్ట్రోబిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు కూడా ఈ మాసంలో వ్యాపిస్తుంది. దీని నివారణకు గంధకం 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**బెండ:** తెల్లదోమ నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వంగ:** ఆకు మాడు తెగులు నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**తీగజాతి కూరగాయలు:** తీగజాతి పంటలపై గంధకం సంబంధిత తెగులు మందులు వాడరాదు. దీని వలన ఆకులు మాడిపోతాయి.

పుచ్చను డిసెంబర్ రెండవ పక్షం నుండి నాటుకోవచ్చు. 2-2.5 మీ. ఎడంతో, 60 సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలను తయారు చేసుకొని, కాలువలకు ఇరువైపులా 30-50 సెం.మీ. ఎడంతో విత్తనాలు విత్తుకోవాలి. 500-600 గ్రా. విత్తనం ఎకరాకు సరిపోతుంది.

**ఫ్రెంచి చిక్కుడు:** ఈ పంట సాగుకు చల్లని వాతావరణం అనుకూలం. ఈ మాసం చివరి వరకు నాటుకోవచ్చు. 20-25 కిలోల విత్తనం ఎకరాకు సరిపోతుంది. పాలకూరను కూడా ఈ మాసం చివరి వరకు నాటుకోవచ్చు.

**అల్లం:** ఈ మాసంలో అల్లం దుంపలు పక్వానికి వస్తాయి. తవ్వుకోవచ్చు. ఆకులు పసుపు పచ్చగా మారి, ఎండిపోవడం, కాండం ఎండిపోవడంను బట్టి అల్లం దుంపలు పక్వానికి వచ్చినట్లుగా గుర్తించవచ్చు.

**పసుపు:** మచ్చాకు తెగులు నివారణకు లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్, జిగురు కలిపి ఆకులపై పిచికారి చేయాలి. వారం రోజుల తరువాత 1 గ్రా. పైరాక్లోస్ట్రోబిన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. దుంప ఈగ వల్ల దుంపల్లో బియ్యపు గింజల మాదిరిగా తెల్లటి పురుగులు ఏర్పడతాయి. వీటి నివారణకు తోటలో నీరు పెట్టిన తరువాత కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను ఎకరాకు 5 కిలోల చొప్పున ఇసుకతో కలిపి సాళ్ళలో వేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9441168156






# మామిడిలో నెలవారీ చేయవలసిన యాజమాన్య పద్ధతులు

డా॥ ఆది శంకర్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ బి. రాజశేఖర్, కె. రామకృష్ణ, డా॥ ఓ. శైల,
డా॥ ఎన్. లావణ్య, ఇ. జ్యోత్స్న, కె. జ్ఞానేశ్వర్ నారాయణ
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

ఫలరాజు అయిన మామిడి తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమైన ఉద్యాన పంట. మామిడి సాగుకు మన రాష్ట్రంలోని వాతావరణం చాలా అనుకూలంగా ఉండి మంచి నాణ్యమైన దిగుబడిని ఇస్తుంది. మన రాష్ట్రంలో సుమారు 2,89,203 ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. మన రాష్ట్ర సగటు దిగుబడి 1023.612 మెట్రిక్ టన్నులు మేలైన యాజమాన్యం పాటించినట్లయితే ఖర్చు తగ్గించుకొని, మంచి దిగుబడి పొందవచ్చు.

**డిసెంబర్:**

- చెట్లకు మొదటిసారి పలుచగా నీటి తడి ఇవ్వాలి. దీని వల్ల మొగ్గ అంత ఒకే సారి సాగుతుంది.
- అధిక పూత కొరకు 10 గ్రా. 13-0-45 + 5 గ్రా. సూక్ష్మ పోషక మిశ్రమం + 0.25 మి.లీ. ప్లానోఫిక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టు అంతా తడిచేలా పిచికారీ చేయాలి.
- పూమొగ్గ దశలో చెట్లపై తేనెమంచు పురుగు, ఆంత్రాక్నోస్ మచ్చ తెగులు మరియు బూడిద తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రా. మరియు నీటిలో కలిగే గంధకం 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా థయోఫనేట్ మిథైల్ 1.5 గ్రా. లేదా డైఫెనోకొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పూత మొగ్గ సాగే దశలో 10-15 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి.

**జనవరి:**

- పూత విచ్చుకునే సమయం.
- తేనె మంచు మరియు బూడిద తెగులు నివారణకు పచ్చిపూత దశలోనే థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లేదా ఫిప్రోనిల్ 80 % డబ్ల్యు. జి. 0.25 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి. లీ. మరియు హెక్సాకొనజోల్ 2 మి. లీ. లేదా ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 1 గ్రా. లేదా అజాక్సీస్ట్రోబిన్ 1 మి. లీ. + వేపనూనె 5 మి. లీ. కలిపి పిచికారీ చేసుకోవాలి.
- 10-15 రోజుల వ్యవధిలో నీటి తడులను ఇవ్వాలి. పూత విచ్చుకున్న తర్వాత 10-15 రోజుల వరకు ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేయరాదు.

**ఫిబ్రవరి:**

- ఈ సమయంలో పిందె ఏర్పడుతుంది. కావున 10-15 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి.
- పది సంవత్సరాలు పైబడిన ప్రతి చెట్టుకు డిఎపి 700 గ్రా. యూరియా 400 గ్రా., ఎమ్ఓపి-600 గ్రా. చొప్పున వేసుకొని నీరు పెట్టాలి.
- పిందె రాలకుండా మల్టీ-కే (13-0-45) 10 గ్రా. + సూక్ష్మ పోషక మిశ్రమం 5 గ్రా. + ప్లానోఫిక్స్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకులన్నీ తడిచేలా పిచికారీ చేయాలి.
- పండు ఈగ బుట్టలను (మిథైల్ యూజినాల్) ఎకరానికి 10-25 ఏర్పాటు చేసి ప్రతి 20 రోజులకు ఎరలను మారుస్తూ పంట పూర్తి అయ్యే వరకూ కొనసాగించాలి.

- తేనె మంచు పురుగు, తామర పురుగు మరియు ఆంత్రాక్నోస్ కాయ మచ్చ తెగులు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. మరియు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

**మార్చి:**

- ఈ సమయంలో కాయ ఎదుగుదల దశలో ఉంటుంది. కావున ప్రతి 10-15 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి.
- కాయతొలుచు పురుగు ఏమైనా గమనించిన వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. + వేప నూనె 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- కాయలపై నల్లటి మచ్చలు మరియు జిగురు వంటి నీటి బిందువులు గమనించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + స్ట్రెప్టోసైక్లిన్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- కాయసైజు పెరగడానికి 10 గ్రా. 13-0-45 + 2 గ్రా. బోరాన్ + 5 గ్రా. జింకుసల్ఫేట్ + 5 గ్రా. కాల్షియం నైట్రేట్ + 0.25 మి.లీ ప్లానోఫిక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పండు ఈగ బుట్టలు ఎకరానికి 10 నుంచి 25 చొప్పున అమర్చాలి.
- రాలిన కాయలు ఏరి కాల్చివేయాలి.

**ఏప్రిల్:**

- ఎదిగిన కాయలను ఫ్రూట్ హార్వెస్టర్‌లతో జాగ్రత్తగా కోసుకుని నీడలో మట్టి అంటకుండా సొన కార్చాలి. కాయ కోతకు 15 రోజుల ముందు నీటి తడులను నిలిపివేయాలి.
- పండు ఈగ బుట్టలు ఎకరానికి 10 నుంచి 25 చొప్పున అమర్చాలి.
- రాలిన కాయలను పోగు చేసి కాల్చి వేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9912604549**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.యస్.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. డిసెంబర్, 2023 నెలలో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 06-12-2023 | యాసంగి వరి నారుమడిలో చలి యాజమాన్యం | డా॥ యల్. కృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, 9866091711 |
| 13-12-2023 | యాసంగి పంటలలో సస్యరక్షణ | జి. మాధురి, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 9550635307 |
| 20-12-2023 | యాసంగి పంటలలో కలుపు యాజమాన్యం | డా॥ టి. రాం ప్రకాశ్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ అఖిల భారత సమన్వయ కలుపు యాజమాన్య పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, 7396657949 |
| 27-12-2023 | వ్యవసాయ రంగంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆవశ్యకత మరియు వాటి ప్రయోజనాలు | యస్. పల్లవి, యస్.యమ్.యస్ (విస్తరణ విభాగం) కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్, 7337526313 |

**రైతులు కాల్ చేయవలసిన ఫోన్ నంబర్ : 040-23244834 / 040-23244836**



# గ్లాడియోలస్ కట్ ఫ్లవర్

డా॥ యం. విజయలక్ష్మి, డా॥ యం. వెంకటేశ్వర్ రెడ్డి, డా॥ ఎ. నిర్మల మరియు డా॥ కె. చైతన్య
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్

గ్లాడియోలస్ గ్రాండిఫ్లోరస్ ఇరిడేసి కుటుంబానికి చెందిన ముఖ్యమైన పూల పంట. పూలను స్థానికంగా మరియు మార్కెట్లో కట్‌ఫ్లవర్స్‌గా విక్రయిస్తారు. వివిధ రంగుల ప్రకాశవంతమైన పువ్వులు గల కాడలను పుష్పగుచ్ఛాలలోను మరియు ఇంటిలోపల అలంకరణ కొరకు ఉపయోగిస్తారు. గ్లాడియోలస్ పూల కాడలు ఎక్కువ రోజులు నిలువ ఉండి దూర ప్రాంతాలకు కూడా సరఫరా చేయటానికి అనుకూలం.

**వాతావరణం:** గ్లాడియోలస్ వివిధ వాతావరణ పరిస్థితులలో సాగు చేసినప్పటికి, మొక్క పెరుగుదల మరియు అభివృద్ధికి సమృద్ధిగా సూర్యరశ్మి అవసరం, లేనట్లయితే పూల కాడలు అభివృద్ధి చెందవు. సరాసరి పగటి ఉష్ణోగ్రతలు 15-20$^{0}$ సెంటీగ్రేడ్ ఉండాలి. ఒకవేళ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయినట్లయితే మొక్కలు చలికి దెబ్బతింటాయి. 2-7 ఆకుల దశలో తక్కువ ఉష్ణోగ్రతలు (2-5$^{0}$ సెంటీగ్రేడ్) ఎక్కువ రోజులు నమోదు అయితే కాడలోని పూల సంఖ్య బాగా తగ్గిపోతుంది.

**నేలలు :** గ్లాడియోలస్ సాగుకు సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉన్న తేలిక పాటి నేలలు బాగా అనుకూలం. 5.5 నుండి 6.5 ఉదజని సూచిక ఉన్న మురుగు నీటి వసతి కలిగిన తేలికపాటి ఆమ్ల నేలలు సాగుకు బాగా అనుకూలమైనప్పటికీ, ఉదజని సూచిక 5 నుండి 8 వరకు గల నేలల్లో కూడా పంట సాగుచేయవచ్చును. ఉదజని సూచిక ఎక్కువగా ఉన్నపుడు భూమికి సేంద్రియ ఎరువులు ఎక్కువగా అందించటం ద్వారా తీవ్రతను తగ్గించవచ్చును.

**రకాలు:** ప్రపంచం మొత్తంలో చాలా రకాలు సాగులో ఉన్నా గ్లాడియోలస్ రకాలు ధీరజ్, షాగున్, కాండీమాన్, స్నోవైట్, ట్రేడర్ హార్న్ ఎక్కువగా సాగుకు ఉపయోగిస్తారు.

**ప్రవర్ధనం:** గ్లాడియోలస్‌ను వాణిజ్య పంధాలో దుంపల ద్వారా ప్రవర్ధనం చేస్తారు. తాజా దుంపలలో 70 నుండి 90 రోజుల వరకు నిద్రావస్థ ఉంటుంది, కాబట్టి భూమిలో నుంచి తీసిన వెంటనే దుంపలు మొలకెత్తవు. 4 సెం. మీ. వ్యాసము ఉన్న దుంపలు పూల ఉత్పత్తికి అనుకూలం. బల్ల పరుపుగా ఉన్న దుంపలకంటే బొంగరం ఆకారంలో ఉన్న దుంపల నుండి పూల దిగుబడి బాగా ఉంటుంది. చిన్న పరిమాణంలో ఉన్న పిల్ల దుంపలను 2 లేక 3 సార్లు వరుసగా నాటినప్పుడు మాత్రమే పూలు రావటానికి అవకాశం ఉంది. పిల్ల దుంపలను సమతుల మడులలో దగ్గరగా నాటుతారు. దుంపలను నాటటానికి ముందు 24 గంటలు నీటిలో నానబెట్టినట్లయితే సమానంగా ఒకేసారి మొలకలు వస్తాయి. దుంపల నుండి వచ్చిన పెద్ద దుంపలను పూలకాడల ఉత్పత్తి కొరకు ఉపయోగిస్తారు.

**నాటటం :** గ్లాడియోలస్‌లను సాధారణంగా జూన్ నుండి నవంబర్ వరకు నాటినప్పటికి, అవసరాన్ని బట్టి డిసెంబర్ మాసం వరకు నాటుకోవచ్చును. మార్కెటుకు ఒకే విధమయిన సరఫరా కోసం 15 రోజుల వ్యవధిలో నాటుకోవటం మంచిది. దుంపలను నాటుకొనే ముందు దుంప మీద ఉన్న పొలుసులను తీసివేసి మ్యాంకోజెబ్ 2 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. మందును లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో 15 నుండి 20 నిమిషాలు దుంపలను ఉంచినట్లయితే దుంపల ద్వారా వ్యాప్తి చెందే రోగాలను నిరోధించవచ్చును. నిద్రావస్థలేని దుంపలను మాత్రమే నాటుకోవాలి. దుంప భాగంలో ఆవిర్భవించిన వేరు మొగ్గల వలన దుంపలలో నిద్రావస్థ తొలిగి పోయినట్లుగా గుర్తించవచ్చును. ఇసుక నేలల్లో సమతుల మడులలో నాటుకొన్నపటికి, బరువు నేలల్లో నాటేటప్పుడు బోదెల మీద కాని

లేదా ఎత్తు మడుల మీద కాని నాటుకోవాలి. గ్లాడియోలస్ దుంపలను 30×20 సెం. మీ. దూరంలో, 5-8 సెం. మీ. లోతులో నాటుకోవాలి. నాటేటప్పుడు భూమిలో తగినంత తేమ ఉండే విధంగా చూసుకుంటే అన్ని మొలకలు ఒకేసారి వస్తాయి.

**ఎరువులు :** గ్లాడియోలస్‌కు అందించవలసిన ఎరువుల మోతాదు, వాతావరణం మరియు నేల స్వభావాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఆఖరి దుక్కిలో ఎకరాకు 8 నుండి 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 15-20 కిలోల నత్రజని, 30-35 కిలోల భాస్వరం మరియు 30-35 కిలోల పోటాష్‌నిచ్చే ఎరువులను అందించాలి. తరువాత పైపాటుగా 30-35 కిలోల నత్రజని రెండు దఫాలుగా అంటే 3 అకులు మరియు 6 ఆకుల దశలో అందించాలి. పూల నాణ్యత పెంచటానికి సూక్ష్మ పోషకాలయిన ఐరన్ సల్ఫేట్ 0.75 % మరియు 0.5 % జింక్ సల్ఫేట్‌ని 3 అకులు మరియు 6 ఆకుల దశలో మొక్కలపై పిచికారి చేయాలి.

**అంతరకృషి మరియు నీటి యాజమాన్యం:** దుంపలు నాటే సమయంలో భూమిలో తగినంత తేమ ఉండాలి. అన్ని దుంపలు మొలకెత్తే వరకు నీటి తడులు ఇస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి నీటి తడి ఇవ్వాలి. పుష్పించే సమయంలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి.

మొక్కలు పడిపోకుండా మట్టిని మొక్కచుట్టూ ఎగదోయాలి. దీనితో పాటు మొక్కలు పుష్పించే దశలో తప్పనిసరిగా ఊతమివ్వాలి. ఈ దశలో ఊతమివ్వన్నట్లయితే పూల కాడ బరువు వలన మొక్కలు ఒక ప్రక్కకు వాలి పడిపోతాయి. ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నప్పుడు ఊతమివ్వడం సాధ్యం కాదు కనుక వెదురు కర్రలను మొక్క వరుసల చివర ఇరువైపుల దగ్గరగా భూమిపై నిలబెట్టి, నారను ఈ రెండు కర్రలకు సమాంతరంగా రెండు వరుసలలో చుట్టినట్లయితే మొక్కలు పడిపోకుండా నిలబడి ఉంటాయి.

**కోత:** రకాన్ని బట్టి గ్లాడియోలస్‌లో దుంపలు నాటిన 60 నుండి 100 రోజులలో పూల కాడలు వస్తాయి. కాడ అడుగు భాగంలో ఒక మొగ్గలో రంగు ఏర్పడినప్పుడు కాడలను కోయాలి. సాధారణంగా చల్లని సమయంలో అంటే ఉదయం లేదా సాయంత్రం వేళలో పూల కాడలను పదునైన కత్తితో కోయాలి. కోత సమయంలో మొక్కకు నాలుగు ఆకులు ఉండిపోయే విధంగా చూడాలి. దీని వలన పిల్లదుంపలు మరియు ప్రధాన దుంపలు బాగా అభివృద్ధి చెందుతాయి. కాడలను కోసిన వెంటనే సిట్రిక్ ఆమ్లము లేదా ఏదేని ప్రిజర్వేటివ్ కలిగిన నీటిలో చివరలు మునిగేటట్లు ఉంచాలి.

**దిగుబడి:** పూల కాడల దిగుబడి సాగు చేసే రకం, దుంప పరిమాణం, మొక్కల సాంద్రత, మరియు పాటించిన యాజమాన్య పద్ధతులు బట్టి మారుతూ ఉంటుంది. సాధారణంగా ఒక్క మొక్క నుండి ఒక్క పూవుకాడ మరియు దుంప వస్తుంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక మొక్కల సాంద్రత ఉన్న ఒక్క ప్రామాణిక ప్రదేశం నుండి అధిక దిగుబడులు సాధించవచ్చును.

**వర్గీకరణ మరియు ప్యాకింగ్ :**మార్కెట్‌కు పూల కాడలను సరఫరా చేసే ముందు కాడ పొడువు మరియు కాడలోని పూల సంఖ్యను బట్టి వర్గీకరించాలి. కాడ వంకరలు లేకుండా పొడవుగా, పూలు ఎక్కువగా విచ్చుకోకుండా, పురుగులు మరియు తెగుళ్ళ ఆశించకుండా ఉండాలి. ఇలా వర్గీకరించిన కాడలను 10 నుండి 20 ఒక కట్టగా కట్టి రబ్బరు బ్యాండు వేయాలి. స్థానిక మార్కెట్‌కు అయితే వదులుగాను, దూర ప్రదేశాలకు అయితే గట్టిగా కట్టి సరఫరా చేయాలి. ఇలా కట్టిన కట్టలను కార్డు బోర్డు లేదా చెక్క పెట్టెలలో ఉంచి సరఫరా చేయాలి. దూరప్రదేశాలకు సరఫరా చేయుటానికి, శీతలీకరణ (రిఫ్రిజిరేటర్) వాహనాన్ని ఉపయోగించుకోవాలి. సరఫరా చేసేటప్పుడు కాడలను నిలువుగా ఉంచి సరఫరా చేస్తే కాడల చివరలు భూమ్యాకర్షణకు గురికావు.

**సొసైటీ ఆఫ్ అమెరికన్ ఫ్లోరిస్ట్‌లు వర్గీకరించిన ప్రమాణాలు**

| రకం | కాడ పొడువు (సెం. మీ.) | కాడలోని పూల సంఖ్య (తక్కువలో తక్కువ) |
|---|---|---|
| ఫ్యాన్సీ | 107 మరియు ఆపైన | 16 |
| స్పెషల్ | 96-107 | 14 |
| స్టాండర్డ్ | 81-96 | 12 |
| యుటిలిటీ | 81 మరియు ఆపైన | 10 |

### దుంపల కోత మరియు నిలువ

పూల కాడలు కోసిన 50-60 రోజుల తరువాత, ఆకులు పసుపు వర్ణములోకి మారి ఎండిపోతున్నప్పుడు దుంపలను త్రవ్వి తీసుకోవాలి. దుంపలను త్రవ్వితీయటానికి 3-4 వారాల ముందు నీటి తడి ఇవ్వటం ఆపేయాలి. దుంపలను తీయటానికి ముందు తేలికపాటి తడి ఇచ్చినట్లైతే భూమి గుల్లబారి దుంపలను తేలికగా త్రవ్వి తీయటానికి వీలవుతుంది. దుంపలను ఆలస్యంగా త్రవ్వి తీయటం వలన తరువాత పంట కాలంలో కాడలు పొడువుగాను, ఆలస్యంగాను వస్తాయి. ఒకవేళ తొందరగా తీసినట్లయితే పూల కాడలు వస్తాయి.

దుంపలను, త్రవ్వి తీసివేసిన తరువాత వీటికి అంటుకొని ఉన్న మట్టి మరియు పైపొరను తీసివేయాలి. తరువాత తల్లి మరియు పిల్ల దుంపలను వేరుచేసి శిలీంద్రనాశక మందుతో శుద్ధి చేసి $4-5^0$ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల చల్లని గదిలో నిలువ చేయాలి. అయితే సదుపాయాల లోపాల వలన అందరికి చల్లని గదిలో నిలువ చేయటం సాధ్యం కాదు. ఇటువంటి పరిస్థితుల్లో గాలి బాగా చొరబడే గదిలో దుంపలను ప్లాస్టిక్ ట్రేలలో ఉంచి నిలువ చేయవచ్చు. ఇలా నిలువ చేసిన దుంపలను తరుచుగా పరీక్షిస్తూ రోగాల బారిన పడిన తల్లి మరియు పిల్ల దుంపలను తీసివేయాలి.

తల్లి మరియు పిల్ల దుంపలు కొంతకాలం నిద్రావస్థలో ఉంటాయి. నిద్రావస్థ ఉష్ణప్రదేశాలలో ఎక్కువుగా ఉంటుంది. నిద్రావస్థ తొలగించటానికి దుంపలను 35 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత 10 రోజుల పాటు లభించే విధంగా చేసి తదుపరి $0^0$ సెంటీగ్రేడ్ వద్ద 10-15 రోజుల పాటు నిలువ ఉంచితే నిద్రావస్థ పూర్తిగా తొలగిపోతుంది. దీనితో పాటు పెరుగుదల నియంత్రించే కారకాలయిన ఇథరిల్ 1000 పిపియం (1 మి. గ్రా.) లేదా థయోయూరియ 500 పిపియం (5 మి.గ్రా.) లీటరు నీటిలో కలిపి 24 గంటల పాటు నానబెట్టినట్లయితే దుంపలలో నిద్రావస్థ తొలిగిపోయి మొలకలు వస్తాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7382742526**

**పి.జె.టి.యస్.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 06-12-2023 | యాసంగి కుసుమ సాగు - మెళకువలు |
| | సమతుల్య ఆహారం ఎందుకు కావాలి |
| 13-12-2023 | ఆయిల్ పామ్ తోటల్లో కీటకాలు / పురుగులు మరియు తెగుళ్ళ నివారణ |
| | చిరుధాన్యాల ప్రాముఖ్యత (ఇంటర్వ్యూ) |
| 20-12-2023 | యాసంగిలో మొక్కజొన్న పంట సాగు - రైతన్నలు పాటించవలసిన మెళకువలు |
| | చంటి పిల్లల ఎదుగుదలలో మైలు రాళ్ళు (ఇంటర్వ్యూ) |
| 27-12-2023 | యాసంగిలో నువ్వుల సాగు విధానం |
| | వినియోగదారుల హక్కులు |



# నోని ఔషధ ఉపయోగాలు

వి. కృష్ణవేణి మరియు డా॥ ఎమ్. సంపత్ రెడ్డి
సుగంధ మరియు ఔషధ మొక్కల పరిశోధన కేంద్రం, శ్రీ కొండా లక్ష్మణ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్

నోని చాలా ముఖ్యమైన పండు. ఇది 2000 సంవత్సారాల నుండి ఆరోగ్య పునరుద్ధరణ లక్షణాల కోసం విస్తృతంగా ఉపయోగించబడుతుంది. దీనిని సాధారణంగా 'నోని' అని "మద్దిచెట్టు" అని, "ఇండియన్ మల్బెరీ" అని పిలువబడుతుంది. వీటి పండిన పండ్ల నుండి అసహ్యకరమైన వాసన కారణంగా దాని ప్రజాదరణ చాలా సంవత్సరాలుగా తగ్గిపోయింది. కానీ పండులో ఉండే అద్భుతమైన ఔషధ గుణాల కారణంగా తిరిగి ప్రజాదరణ పొందింది. సాధారణంగా నోనిని జ్యూస్ రూపంలో తీసుకుంటారు.

**ఉపయోగాలు:** దీనిని ఉష్ణ ప్రదేశాలలో ఎక్కువగా పండిస్తున్నారు.

- నోనిలో బలమైన ఆంటీ ఆక్సిడెంట్స్‌లు కలిగి ఉన్నాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, బి, బి2, బి3, బి6, బి12 మరియు ఖనిజాలు కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీషియం, జింక్, కాపర్, మాంగనీస్ వంటి ఇతర ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి.
- నోని అధిక రక్తపోటు, గుండె జబ్బులు మరియు స్ట్రోక్‌లను తగ్గించడంలో సహాయపడుతుంది.
- నోని క్యాన్సర్‌ను నివారిస్తుంది మరియు ఆంటీకార్సినోజెనిక్‌గా పనిచేస్తుంది. ఇందులో ఉండే బీటా-గ్లూకాన్స్, లినోలెనిక్ ఆసిడ్ ఉండటం వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చు.
- నోని శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను సమతుల్యంగా ఉంచుతుంది. అలాగే టైప్ 1, 2 మధుమేహం తగ్గిస్తుంది.
- నోని కీళ్ళవాపు మరియు కీళ్ళ నొప్పి సమస్యను నయం చేస్తుంది.
- నోని పండులో సెరోటోనిన్ హార్మోన్ ఉండడం వల్ల ఆందోళన, డిప్రెషన్, నిద్ర సమస్యలు మరియు ఆల్జీమర్స్ వ్యాధిని తగ్గించడంలో సహాయపడుతుంది.
- నోని వృద్ధాప్యం మరియు చర్మ వ్యాధులను నివారిస్తుంది మరియు ఆస్తమా, పైల్స్, పంటినొప్పులు, అలర్జీస్ వంటి రోగాలను నయం చేస్తుంది.
- ఇందులో 'క్వెర్‌సెటిన్, క్లోరోజెనిక్' ఆసిడ్ అనే అద్భుతమైన ఆంటీ ఆక్సిడెంట్స్ కలవు.
- నోని రసం కిడ్నీ, మూత్ర సంబంధిత మరియు వెరికోస్‌వెయిన్స్ వంటి వ్యాధులను తగ్గించడానికి ఉపయోగబడుతుంది.
- ఇందులో 'స్కోపోలెటిన్' అనే ఆల్కలాయిడ్ వలన ఆంటీబ్యాక్టీరియల్, ఆంటీ ఫంగల్, ఆంటీ హిస్టమైన్ లాంటి సద్గుణాలను కలిగి ఉంది. ఇవి శరీరం యొక్క రోగ నిరోధక రక్షణ విధానాన్ని పెంచుతాయి.
- నోని జ్యూస్ థైరాయిడ్, స్త్రీ రుగ్మతలు, ఋతు సమస్యలు, మెనోపాస్ వంటి వాటిని తగ్గిస్తుంది.
- ఈ చెట్టు బెరడు కషాయం కామెర్ల వ్యాధి తగ్గించడానికి ఉపయోగపడుతాయి.
- నోని జ్యూస్‌లో ఒబేసిటి (ఊబకాయం), పక్షవాతం తగ్గించే గుణాలు ఉంటాయి.
- సంతానలేమి సమస్యను తొలగించడంలో కూడా నోని చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనిని తీసుకోవడం ద్వారా పురుషుల్లో నపుంసకత్వం, మహిళల్లో వంధ్యత్వం సమస్యలను అధిగమించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.91107 26430

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, డా॥ జె.ఎస్. సుధారాణి మరియు డా॥ కె. రాజమణి
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | |
| 1. | 6.12.23 | యాసంగి నూనె గింజ పంటల సాగుకు సూచనలు | **డా॥ ఐ. తిరుపతి,** యస్.యమ్.యస్ (క్రాప్ ప్రొటెక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, 9494030004 |
| 2. | 11.12.23 | వరి మాగాణుల్లో ఆరుతడి పంటల సాగు | **డా॥ యమ్. మల్లారెడ్డి,** సహ పరిశోధన సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం, 984819954 |
| 3. | 15.12.23 | యాసంగి పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం | **డా॥ యస్. శ్రీదేవి,** ప్రధాన శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) వ్యవసాయ పరిశోధనా స్థానం, తోర్నాల, 9849822270 |
| 4. | 18.12.23 | యాసంగికి అనువైన వరి రకాలు మరియు నారుమడి యాజమాన్యం | **డా॥ పి. గోన్యా నాయక్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 9701592326 |
| 5. | 27.12.23 | యాసంగి పంటలలో కలుపు యాజమాన్యం | **డా॥ యు. నాగభూషణం,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 8555941964 |
| 6. | 29.12.23 | మిరపలో సస్యరక్షణ సూచనలు | **డా॥ జె. హేమంత్ కుమార్,** అసోసియేట్ డీన్ వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట, 9989623831 |

II. టి-శాట్ (రైతు మిత్ర): సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 4.12.23 | మారుతున్న వాతావరణ పరిస్థితులు - వివిధ పంట అవశేషాల యాజమాన్యం | **డా॥ యన్. సాయినాథ్,** శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జగిత్యాల, 8891893440 |
| 2. | 11.12.23 | యాసంగిలో సాగు చేసే పంటలలో పోషక యాజమాన్యం | **డా॥ సి.హెచ్. రాములు,** శాస్త్రవేత్త (సాయిల్ సైన్స్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 7013036957 |
| 3. | 18.12.23 | యాసంగి పంటలలో సస్యరక్షణ | **డా॥ బి. మల్లయ్య,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ పాథాలజి) మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, 944040416 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ సిహెచ్. వేణు గోపాల రెడ్డి మరియు డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. వరి సంకర విత్తనోత్పత్తికి పాటించవలసిన వరుసల (ఎ:ఆర్ వరుసలు) నిష్పత్తి ఎంత?**

ఎ) 10:2 బి) 3:1

సి) 6:2 డి) 4:2

**2. చలి ప్రభావం వల్ల వరి నారుమడులలో సాధారణంగా ఏ ధాతువు లోపాన్ని గమనించవచ్చును?**

ఎ) ఇనుము బి) నత్రజని

సి) జింక్ డి) పొటాషియం

**3. రాగి వేసవి పంటగా ఎప్పటిలోపు వేసుకోవాలి?**

ఎ) జనవరి మొదటి వారం లోపు

బి) ఫిబ్రవరి మొదటి పక్షం లోపు

సి) మార్చి డి) డిసెంబర్

**4. వేరుశనగలో నాణ్యమైన కాయలు మరియు గింజలు రావటానికి ఈ క్రింద పేర్కొన్న ఏ ఎరువులను వేయాలి?**

ఎ) యూరియా బి) డి ఏ పి

సి) జిప్సమ్ డి) మ్యూరేట్ ఆఫ్ పొటాష్

**5. ఈ క్రింద పేర్కొన్న ఏ పురుగు నివారణకు గాసిప్లూర్ జెల్‌ను ఉపయోగిస్తారు?**

ఎ) గులాబిరంగు పురుగు

బి) పొగాకు లద్దెపురుగు

సి) శనగ పచ్చ పురుగు డి) కాండం తొలుచే పురుగు

**6. నూనెగింజల నిల్వకు సురక్షిత విత్తన తేమ శాతం ఎంత?**

ఎ) 13% బి) 10% సి) 8% డి) 6%

**7. బంతిని క్రింద తెలిపిన ఏ పురుగుకు ఆకర్షక పంటగా వాడుతారు?**

ఎ) శనగ పచ్చ పురుగు

బి) పొగాకు లద్దె పురుగు

సి) తామర పురుగులు డి) తెల్లదోమ

**8. ఈ క్రింద పేర్కొన్న జీవన ఎరువుల్లో నత్రజని స్థిరీకరించే జీవన ఎరువు ఏది?**

ఎ) అజోస్పైరిల్లమ్ బి) రైజోబియం

సి) అజటోబ్యాక్టర్ డి) పైవన్నీ

**9. ఐసిఏఆర్ ఆధ్వర్యంలోని భారతీయ వరి పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?**

ఎ) భువనేశ్వర్ బి) పూనె

సి) హైదరాబాద్ డి) నాగ్‌పూర్

**10. రైతులు ఏదైనా జీవశిలీంధ్రనాశిని లేదా జీవన ఎరువుతో విత్తనశుద్ధి చేయదలిచినప్పుడు ముందుగా దేనితో చేయాలి?**

ఎ) ముందుగా రసాయన పురుగు మందులతో విత్తనశుద్ధి చేసి ఆరబెట్టిన తర్వాత జీవశిలీంధ్రనాశిని (జీవన ఎరువులతో చేయాలి)

బి) ముందుగా జీవశిలీంధ్రనాశిని (జీవన ఎరువులతో చేయాలి) తో విత్తనశుద్ధి చేసిన తర్వాత రసాయన పురుగు మందులతో చేయాలి.

సి) రసాయన పురుగు మందులు మరియు జీవశిలీంధ్రనాశిని లేదా జీవన ఎరువులు కలిపి విత్తనశుద్ధి చేయాలి

డి) ఏదీకాదు

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## కృషి విజ్ఞాన మరియు ఏరువాక కేంద్రాల్లో అధిక సాంద్రత ప్రత్తి సాగు పద్ధతిపై ఘనంగా నిర్వహించిన కిసాన్ మేళాలు

విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కృషి విజ్ఞాన మరియు ఏరువాక కేంద్రాల్లో కేంద్రీయ ప్రత్తి పరిశోధన సంస్థ, నాగ్‌పూర్ వారి సహకారంతో అధిక సాంద్రత ప్రత్తి సాగు పద్ధతి పై నవంబర్ మాసంలో కిసాన్ మేళాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలకు విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా|| పి. రఘు రామి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అధిక సాంద్రత ప్రత్తి సాగులో పంట అంతా ఒకేసారి కాపుకు వస్తుందని కావున యాంత్రీకరణతో ప్రత్తి పంటను కోయవచ్చని, ఈ పంట తీసిన తర్వాత నీటి వసతి ఉన్నచోట ఆరుతడి పంటలైన పెసర, మినుము వేసుకొని రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాలలో విస్తరణ సంచాలకులు, డా|| వి. సుధారాణి మాట్లాడుతూ రైతు సోదరులు కిసాన్ మేళా వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరుతూ, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తి సాగు, సమగ్ర యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం వంటి అనేక అంశాలతో పొందుపరిచిన కర పత్రాలను ఆవిష్కరించడం జరిగింది.

కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్‌లో జరిగిన కిసాన్ మేళాకు కేంద్రీయ ప్రత్తి పరిశోధన సంస్థ, నాగ్‌పూర్ డైరెక్టర్ డా|| వై.జి. ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అధిక సాంద్రత ప్రత్తి సాగు చేయడం వలన పంట తీత 140-150 రోజులలో అంటే డిసెంబర్ వరకు పంట చేతికి వస్తుందని, ఇలా సాగు చేయడం వలన పంట చివరి దశలో వచ్చే గులాబిరంగు పురుగు ఉధృతి తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

వివిధ కేంద్రాలలో నిర్వహించిన ఈ కిసాన్ మేళాలలో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ముఖ్యంగా రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేల సంరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం

వ్యవసాయ కళాశాల, జగిత్యాలలో నేల సంరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యం అన్న అంశంపై ఒక్క రోజు రైతు శిక్షణ కార్యక్రమం నవంబర్ 19న నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో నేల ప్రాముఖ్యత, సంరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యం, వరి తర్వాత వివిధ ఆరుతడి పంటల యాజమాన్యం, వ్యవసాయంలో డ్రోన్‌ల వాడకంపై క్షేత్ర స్థాయిలో మెళకువలు గురించి శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు మరియు రైతులు పాల్గొన్నారు.

## మొక్కల ఆరోగ్య నిర్వహణ-ఆవిష్కరణ-సుస్థిరత అన్న అంశం పై అంతర్జాతీయ సదస్సు

విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు మొక్కల ఆరోగ్య నిర్వహణ-ఆవిష్కరణ-సుస్థిరత అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సును నవంబర్ 15-18 వరకు నిర్వహించారు. ఈ సదస్సుకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరక్టర్ జనరల్ (సస్యరక్షణ) డా|| ఎస్. సి. దూబె గౌరవ అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పురుగు మందులను తగు మాత్రంగా వినియోగించడంతో పాటు పోషక విలువలతో కూడిన అధిక పంట దిగుబడులు తీసేందుకు సురక్షిత వ్యవసాయ పద్ధతులు అనుసరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి మరియు విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ ఎం. రఘునందన్ రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన టెక్నాలజీలను అమలు చేసేటప్పుడు ఆహార భద్రత అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, హరిత విప్లవం దేశంలోని అనేక రంగాలు స్వయం సమృద్ధిని సాధించి ముందుకెళ్ళడానికి కారణమైందని తెలిపారు.

ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డా|| బి. శరత్‌బాబు, విశ్వవిద్యాలయ అధికారులు, విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతులు, దేశ నలుమూలల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, విద్యార్థులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా నిర్వహించిన డా|| బి. రామమూర్తి 5వ స్మారకోపన్యాసం

విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో డా|| బి. రామమూర్తి 5వ స్మారకోపన్యాస కార్యక్రమాన్ని నవంబర్ 20న ఘనంగా నిర్వహించడం జరిగింది. నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) డైరెక్టర్ డా|| సి. హెచ్. శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో నేలల యాజమాన్యం పాత్ర అనే అంశం గురించి వివరిస్తూ దేశంలో జనాభా పెరుగుతున్న కారణంగా సహజ వనరులపై ఒత్తిడి పెరుగుతుందని, ఎరువుల అధిక వినియోగం వల్ల భూసార క్షీణతతో పాటు, పర్యావరణ కాలుష్యం అధికమౌతుందని అన్నారు. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్ని అమలు చేసి భూసార పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, డా|| రామమూర్తి గారి కుటుంబ సభ్యులు, శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పి. సుధాకర్ మరియు మార్ఫ బాబు

# రైతుల పాలిట వరంగా మారిన డ్రిప్ మరియు మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు

డా॥ ఆది శంకర్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ బి. రాజశేఖర్, డా॥ ఓ. శైల, కె. జ్ఞానేశ్వర్, డా॥ ఎన్. లావణ్య మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం





సాధారణంగా చేసే సాగుకు భిన్నంగా, ఆదాయాన్ని పెంచే పంటలను ఆధునిక పద్ధతిలో సాగు చేయడం ప్రస్తుత పరిస్థితులలో అత్యంత కీలకం. రైతులందరూ సర్వ సాధారణంగా సాంప్రదాయ పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. సాంప్రదాయ పంటల సాగుకు భిన్నంగా తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయాన్ని అందించే కూరగాయల సాగును ప్రోత్సహించడానికి కృషి విజ్ఞాన కేంద్రం పాలెంలో రైతు శిక్షణ కార్యక్రమాలు మరియు 2018-2022 సంవత్సరాలలో డ్రిప్ మరియు మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగుపై ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను రైతుల పొలాల్లో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా శ్రీ ఎమ్. రాంచంద్రయ్య గారి పొలంలో కూడా నూతన బీర రకం అర్క ప్రసన్, నూతన టమాటో రకం అర్క అభేద్‌లపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించడం జరిగింది.

శ్రీ ఎమ్. రాంచంద్రయ్య గారు గత కొన్ని సంవత్సరాలుగా వానాకాలంలో తన పొలంలో వరుసగా మొక్కజొన్న మరియు కంది పంటలను సాగు చేసేవారు. వీరికి 10 సంవత్సరాల మామిడి తోట కూడా ఉంది. సాంప్రదాయ పంటల సాగు ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం లేక పెట్టుబడులకు అయ్యే ఖర్చులు పెరుగుతుండడంతో తక్కువ మొత్తంలో నికర ఆదాయాన్ని పొందేవారు.

**సాంకేతిక సహకారం:** శ్రీ ఎమ్. రాంచంద్రయ్య గారు చెన్నపురావు పల్లి ఔత్సాహిక యువరైతు కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం వారు నిర్వహించిన మామిడి మరియు కూరగాయ పంటలలో సమగ్ర యాజమాన్యం రైతు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. అదే విధంగా కె.వి.కె. పాలెం ఆవరణలోని డ్రిప్ మరియు మల్చ్ విధానంలో కూరగాయల సాగు ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. తర్వాత వీరు ఉద్యానవన విభాగ శాస్త్రవేత్త (ఎస్ఎమ్ఎస్) ను సంప్రదించి తనకు కూడా కూరగాయలు సాగు చేయడానికి ఆసక్తి ఉందని సలహాలు మరియు సూచనలను పొందారు. కె.వి.కె వారు రైతు క్షేత్రంలో కూరగాయల సాగుకు సంబంధించిన సాంకేతిక సహకారం మరియు కూరగాయల ఎంపిక, పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను సూచించడం జరిగింది.

**రైతు మొదట్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు:**

- కూరగాయల సాగు ప్రారంభించిన కొత్తలో సాధారణ రైతుల మాదిరిగా ఈయన కూడా చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు.
  వేసవిలో సాగు నీటి కొరత, మనుషులతో కలుపు తీతకు ఎక్కువగా ఉండే కూలీల ఖర్చు, ఎరువులు మరియు నీటి యాజమాన్యంకు పెట్టుబడి ఖర్చు ఎక్కువ ఉండడం, అదే విధంగా వానాకాలంలో టమాటలో కాయకుళ్ళు ఆశించడం (50%) వంగ మరియు తీగజాతి కూరగాయలు మట్టితో కలిసి కలుషితమయ్యేవి మరియు పురుగులు తెగుళ్ళ ఉధృతి అధికంగా ఉండేది. కానీ కె.వి.కె శిక్షణ కార్యక్రమానికి హాజరయిన తర్వాత ఈ సవాళ్ళను కొంతమేరకు అధిగమించగలిగారు.

**రైతు ఆచరించిన మేలైన యాజమాన్య పద్ధతులు:**

- వేసవిలో లోతు దుక్కులు చేసుకోవడం.
- పశువుల ఎరువు వంటి సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం.
- ట్రాక్టరు సహాయంతో 3 ఫీట్ల వెడల్పు గల ఎత్తైన బెడ్లను చేసుకోవడం.
- ప్రతి బెడ్‌కు ఇన్‌లైన్ డ్రిప్ లైన్‌ను అమర్చుకోవడం.

- ప్రాథమికంగా వేసే ఎరువులను వేసుకోవడం
- 25 మైక్రాన్ల మందం మరియు 4 అడుగుల వెడల్పు కల్గిన మల్చింగ్ ఫిల్మ్‌ను ఎత్తైన బెడ్లపై కప్పడం.
- టమాటో, మిరప, వంగ, బీర వంటి కూరగాయల నారును జంట వరుసల పద్ధతిలో 60×45 సెం.మీ. దూరంలో బెడ్‌పై నాటుకోవడం.
- తీగజాతి కూరగాయల మరియు టమాట మొక్కల తీగలను కర్రలతో ఏర్పాటు చేసిన ట్రెల్లిస్ పందిరికి కట్టడం. దీని వల్ల కాయలు నేలను తాకి పాడవడం తగ్గుతుంది.
- నీటిలో కరిగే ఎరువులైన యూరియా, 19-19-19 మరియు 13-0-45 లను ఫర్టిగేషన్ పద్ధతిలో మొక్కలకు అందించడం.
- కె.వి.కె పాలెం శాస్త్రవేత్తల సూచనల మేరకు పంట యాజమాన్యం మరియు సస్యరక్షణ చర్యలు పాటించడం.

**ఆర్థిక మరియు జీవనోపాధిపై ప్రభావం:** శ్రీ ఎమ్. రాంచంద్రయ్య గారు డ్రిప్ మరియు మల్చింగ్ పద్ధతిలో బీర, కాకర మరియు టమాట పంటలను ట్రెల్లిస్ విధానంలో 3 సంవత్సరాలుగా పండిస్తున్నారు. ఒక ఎకరం పొలంలో మల్చింగ్ కొరకు 16500/- రూపాయలు ఖర్చు చేసారు మరియు ఈ షీట్ 2 పంట కాలాలకు ఉపయోగపడింది. దీని వల్ల పంట పెట్టుబడి ఖర్చు 27500/- రూపాయలు వరకు తగ్గడమే కాకుండా పంట దిగుబడి 50% పెరిగింది. ఈ రైతు 2.5 ఎకరాలలో పండించిన కూరగాయల ద్వారా రూ. 8,59,250/- ల స్థూల ఆదాయం మరియు రూ. 4,57,050/- ల నికర ఆదాయాన్ని 2.13:1 ఆదాయ ఖర్చుల నిష్పత్తితో పొందారు.

**రైతు అభిప్రాయం:** కూరగాయ పంటలను డ్రిప్ మరియు మల్చింగ్ విధానంలో కె.వి.కె శాస్త్రవేత్తల సాంకేతిక సహకారాన్ని అందిపుచ్చుకొని సాగు చేయడం వలన అధిక దిగుబడులతో రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారు.

**స్థిరత్వం/కొనసాగింపు:** డ్రిప్ మరియు మల్చింగ్ విధానం పాటించి కూరగాయలను సాగు చేయడం ద్వారా గడించిన అధిక లాభాలను చూసిన తర్వాత ఈ పద్ధతిని అలాగే కొనసాగిస్తూ కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ రైతు సాధించిన విజయం ద్వారా తన గ్రామంతో పాటుగా జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది అభ్యుదయ రైతులకు స్ఫూర్తి ప్రధాతగా నిలిచారు.

**అవార్డు:** శ్రీ ఎమ్. రాంచంద్రయ్య గారికి రైతు దినోత్సవం డిసెంబర్ 23, 2022 రోజున ఉత్తమ ఏరువాక రైతు అవార్డును పిజెటియస్ఏయు యూనివర్సిటీ వారు బహుకరించారు.

**ఒక సంవత్సరంలో డ్రిప్ మరియు మల్చింగ్ విధానంలో సాగు చేసిన కూరగాయ పంటల వివరాలు (2022)**

| క్ర.సం | పంట | విస్తీర్ణం (ఎకరాల్లో) | దిగుబడి (క్వి) | స్థూల ఆదాయం (రూ) | పెట్టుబడి ఖర్చు | నికర ఆదాయం (రూ) | బి:సి నిష్పత్తి (రూ) |
|---|---|---|---|---|---|---|---|
| 1. | బెండ (వానాకాలం) | 1 | 116.5 | 1,74,750 | 72,500 | 1,02,250 | 2.41:1 |
| 2. | కాకర (వానాకాలం) | 1 | 125.0 | 2,00,000 | 98,800 | 1,01,400 | 2.03:1 |
| 3. | బీర (వానాకాలం) | 1 | 146.0 | 1,90,000 | 91,700 | 98,300 | 2.07:1 |
| 4. | టమాట (యాసంగి) | 1 | 215.0 | 1,72,000 | 88,200 | 83,800 | 1.95:1 |
| 5. | వంకాయ (యాసంగి) | 1 | 153.0 | 1,22,500 | 53,200 | 71,300 | 2.30:1 |
| | మొత్తం | 5 | 755.5 | 8,59,250 | 4,04,400 | 4,57,050 | 2.13:1 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9912604549**

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు :** 1. ఎ 2. సి 3. బి 4. సి 5. ఎ 6. సి 7. ఎ 8. డి 9. సి 10. ఎ

# వంగలో మొవ్వు మరియు కాయతొలుచు పురుగు యాజమాన్యం

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సి.హెచ్. వేణు గోపాల రెడ్డి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్




1. వేసవిలో లోతు దుక్కులు చేయడం
2. తట్టుకునే రకాలు సాగు చేయడం
3. సొలానేసియా కుటుంబంకు చెందని పంటలతో పంట మార్పిడి చేయడం
4. పురుగు ఉధృతి గమనించడానికి లింగాకర్షక బుట్టలు అమర్చడం
5. పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను త్రుంచి నాశనం చేయడం
6. ట్రైకోగ్రామా బదనికలను విడుదల చేయడం
7. బి.టి. సంబంధిత మందును పిచికారి చేయడం
8. పురుగు మందులను పిచికారి చేయుటకు ముందు కాయలను కోయడం
9. అవసరాన్ని బట్టి పురుగు మందులను పిచికారి చేయడం

RNI No : TELTEL/2015/60296 December, 2023 Postal Regd.No:HSE/1013/2021-2023
Total No. of Pages : 52 Date of Publication : 06.12.2023
Date of Posting : 09.12.2023



# వ్యవసాయం : సంక్షిప్త సమాచార మాస పత్రిక - లాభసాటి సేద్యానికి కరదీపిక

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,
Owned by Professor Jayashankar Telangana State Agricultural University,
Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152